

# చైతన్యరథం



Voice of the leader



రూ.4వేల పింఛను



# తొలి పింఛను రూ.7వేలు

పెంచిన పింఛను కలిపి జూలైలోనే ఇస్తా • ఇంటివద్దకే.. ప్రతినెలా ఫస్ట్‌కే రూ.4వేలు 2

- వైసీపీ అరాచకాల నిరుకు తథ్యం
- సూపర్ సిక్స్‌తో మీ జీవితాల్లో వెలుగు
- పత్తికొండ ప్రజాగళంలో చంద్రబాబు





## ముస్లింలకు బాబుతోనే భద్రత



మాజీ సైనికుల సంక్షేమానికి

## ప్రత్యేక కార్పొరేషన్



# తొలి పింఛను రూ.7వేలు

- పెంచిన పింఛను కలిపి జూలైలో ఇస్తా
- ఇంటివద్దకే.. ప్రతి ఫస్ట్‌కీ రూ. 4వేలు
- రాష్ట్రం రక్షణ మనందరి కర్తవ్యం
- వైసీపీ అహంకారి ఓటమి తథ్యం
- సత్తెనపల్లికి అంబటి చేసిందేమిటి?
- జాబు కావాలంటే బాబు రావాలి
- సూపర్ సిక్స్‌తో మీ జీవితాల్లో వెలుగు
- సత్తెనపల్లి ప్రజాగళంలో చంద్రబాబు



సత్తెనపల్లి (చైతన్య రథం): వృద్ధుల శవాలతో రాజకీయం చేసే దుర్మార్గుడు జగన్ మోహన్‌రెడ్డి అని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ధ్వజమెత్తారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో నిర్వహించిన ప్రజాగళం సభలో చంద్రబాబు మాట్లాడుతూ మేం కూటమితో వస్తుంటే జగన్‌రెడ్డి శవ రాజకీయాలతో వస్తున్నాడన్నారు. 'ఏప్రిల్ నుంచి నెలకు రూ.4 వేల పింఛన్ ఒకటే తేదీనే మీ ఇంటివద్దకు తెచ్చి ఇస్తాం. జూలై నెలలో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో పెంచిన పింఛన్ కలిపి రూ.7 వేలు ఇచ్చే బాధ్యత నాది. ఎన్నికల కురుక్షేత్రం ప్రారంభమైంది, యుద్ధానికి సిద్ధమవండి. ధర్మాన్ని కాపాడితే అది మనల్ని కాపాడుతుంది. వచ్చే ఎన్నికల్లో అహంకార దుర్యోధనుడు జగన్‌రెడ్డికి ఓటమి తప్పదు. ప్రజాగ్రహ తుఫాన్‌లో వైసీపీ కొట్టుకుపోవటం ఖాయం' అన్నారు చంద్రబాబు.

**కోడెలను బలి తీసుకున్నారు..**

'కోడెల శివప్రసాద్ సేవాభావంతో అభివృద్ధి పనులు చేసి పల్నాటిపులిగా పేరుపొందారు. ఏ పని అప్పగించినా సమర్థవంతగా నిర్వహిస్తారు. ఎన్టీఆర్ బసవతారకం ఆస్పత్రి బాధ్యతలిస్తే సమర్థవంతంగా నిర్వహించారు. జగన్ కోడెల జీవితాన్ని నాశనం చేశాడు. వైసీపీ పాలనలో కోడెలతో ప్రారంభమైన ఆత్మహత్య అనేకమంది ఆత్మహత్యలు, హత్యలకు దారితీసింది. మన పిల్లల బంగారు భవిష్యత్ కావాలంటే సైకో పాలన పోవాలి. జగన్‌ని ఓడించడానికి మీరు సిద్ధమా? కోడెల కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటా. కోడెల కుమారుడు శివరామ్ రాజకీయ భవిష్యత్‌కు నాదీ బాధ్యత అన్నారు అని చంద్రబాబు హామీ ఇచ్చారు.

**రాష్ట్రం రక్షణ మనందరి కర్తవ్యం**

బీసీ నేత ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి తన రెండేళ్ల పదవి వదులుకుని రాష్ట్రం కోసం టీడీపీలో చేరారు. పదవులు, బంధుత్వాలు, డబ్బులు ముఖ్యం కాదు. రాష్ట్రం తగులబడిపోతోంది. రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిది. అమరావతిని జగన్ విధ్వంసం చేశారు. అది నచ్చకే ఈ ప్రాంతవాసిగా ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు టీడీపీలో చేరారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ నేత కన్నా లక్ష్మీ నారాయణ కూడా రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే టీడీపీతోనే సాధ్యమని పార్టీలో చేరారు. సత్తెనపల్లికి సమర్థవంతమైన నాయకుడు కన్నా లక్ష్మీ నారాయణ. యువకుడు, ఉత్సాహవంతుడు లావు కృష్ణదేవరాయలు ఎంపీ అభ్యర్థి. ఈ ఇద్దరి నాయకత్వంలో సత్తెనపల్లికి ఏం కావాలన్నా చేస్తాం అని బాబు హామీ ఇచ్చారు. 'ఇక్కడికి ఒక్కడినే రాలేదు, కూటమిగా మీ ముందుకు వచ్చా. వైసీపీ పోవాలంటే ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని అందరినీ మెప్పించి పొత్తుకు ఒప్పించిన వ్యక్తి పవన్. కేంద్రంలో 400 పైగా సీట్లలో ఎన్డీయే గెలుస్తుంది. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సహకారం అవసరం' అన్నారు. 2014లో అమరావతి, పోలవరం నిర్మాణాలు చేపట్టామని, అతి తక్కువ సమయంలోనే లోటు విద్యుత్‌ని అధిగమించామి, దేశంలో ఎక్కడా లేనివిధంగా 24 వేల కి.మీ సీసీ రోడ్లు వేశామన్నారు. నేడు జగన్ రూ.13 లక్షల అప్పు పెట్టాడు. 1.5లక్షల కోట్లు బకాయిలున్నాయి. కానీ నాకున్న సంకల్పంతో గాడితప్పిన రాష్ట్రాన్ని కేంద్రం సహకారం, పవన్ కృషితో గాడిలో పెట్టే బాధ్యత నాది అన్నారు.

**సత్తెనపల్లికి అంబటి చేసిందేమిటి?**

5 ఏళ్లలో మంత్రి అంబటి రాంబాబు నియోజవకర్గంలో ఏమైనా అభివృద్ధి పనులు చేశాడా? రాష్ట్రంలో ఎన్ని నదులున్నాయో రాంబాబుకి తెలుసా? క్యూసెక్కుకి, టీఎంసీకి తేడా తెలీదు. సత్తెనపల్లి కాలువల్లో పూడిక తీయలేని అసమర్థ వ్యక్తి రాంబాబు. రాంబాబుకి మంత్రి పదవి ఇచ్చింది నన్ను, పవన్‌ని తిట్టడానికే అని చంద్రబాబు దుమ్మెత్తిపోశారు. టీడీపీ హయాంలో మంత్రి అంటే ఒక సమర్థత, హుందాతనం ఉండేది. రాంబాబు నేడు సంక్రాంతి సంబరాల్లో డాన్సులు వేస్తున్నాడు. పోలవరం నిర్మించి డాన్సులు వేసి ఉంటే అందరూ చప్పట్లు కొట్టేవారని ఎద్దేవా చేశారు. సంక్రాంతి సంబరాలుకు ఒక్కో పింఛన్ లబ్ధిదారుని నుంచి రూ.200 చొప్పున రూ.10 లక్షలు వసూలు చేశాడు. ఇంతకంటే దౌర్భాగ్యం మరొకటుందా? అన్నారు. డ్రైనేజీలో పడి చనిపోయిన బీసీ యువకుడికి వచ్చిన నష్టపరిహారంలో 50శాతం వాటా ఇవ్వలేదని ఆ చెక్కు బాధిత కుటుంబానికి ఇవ్వని వ్యక్తి రాంబాబని అన్నారు. రాంబాబు అక్రమ మైనింగ్‌పై వైసీపీ కార్యకర్తలే కోర్టుకెళ్లారు. ఎన్నికల్లో రాంబాబును చిత్తు చిత్తుగా ఓడించి కన్నాను గెలిపించాలని పిలుపునిచ్చారు. జగన్‌లాంటి దుర్మార్గుడు వస్తే మీ ప్రాంతం ఎడారి అవుతుంది. నాగార్జునసాగర్‌లో నీరు పారవు, మీ కన్నీళ్లు పారుతాయి. త్రాగడానికి నీరు ఉండవు. నదుల అనుసంధానంతో మీ పొలాలకు నీరిస్తామని హామీ ఇచ్చారు.

**జాబు రావాలంటే బాబు రావాలి**

జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ అంటూ యువతను జగన్ రెడ్డి మోసం చేశారు. టీడీపీ హయాంలో ఉద్యోగాలు వచ్చాయా లేదోనని జగన్‌రెడ్డి మా తమ్ముళ్లని అడిగి తెలుసుకోవాలి. జాబు రావాలంటే బాబురావాలి. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి సంతకం మెగా డీఎస్సీ పైనే పెడతా. యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత నాది. నిరుద్యోగులకు ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తాం. మీ పిల్లల భవిష్యత్ కోసం, టీడీపీ-జనసేన-బీజేపీ జెండాలు పట్టుకొని రోడ్డుపైకి రావాలని కోరుతున్నా అని బాబు పిలుపునిచ్చారు.

**సూపర్ సిక్స్‌తో జీవితాల్లో వెలుగు**

ప్రజా జీవితాల్లో వెలుగులు నింపేందుకు సూపర్ సిక్స్ పథకాలతో మీ ముందుకొస్తున్నాం. 18 నుంచి 59 సంవత్సరాల్లోపు ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తాం. తల్లికి వందనం పథకంలో భాగంగా ఎటువంటి ఆంక్షలు లేకుండా విద్యార్థులకు ఒక్కొరికి రూ.15000 చొప్పున అందజేస్తాం. ఒక కుటుంబంలో ముగ్గురు, నలుగురు విద్యార్థులున్నా అందరికీ పథకం వర్తింపజేస్తాం. సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇచ్చే బాధ్యత నాది. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తాం. ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.20 వేలు ఆర్థికసాయం చేసి రైతును రాజుగా మార్చే బాధ్యత మేం తీసుకుంటాం. పెట్టుబడులు సాధిస్తాం, పరిశ్రమలు తెస్తాం, ప్రతి ఎకరాకు నీళ్లిస్తాం, మీ ఆదాయాన్ని పెంచడమే కాకుండా ప్రభుత్వానికి కూడా ఆదాయం పెరిగే విధంగా కార్యక్రమాలు చేస్తామని చంద్రబాబు వివరించారు.

**సత్తెనపల్లి ప్రజలకు వరాలు**

రోడ్లన్ని మరమ్మతు చేసే బాధ్యత తీసుకుంటామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అందరి ఆమోదయోగ్యంతోనే అమరావతిని రాజధానిగా పెట్టాం. అమరావతికి 170 కిలోమీటర్లతో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపడతాం. కొండమోడు నుంచి సత్తెనపల్లి రోడ్డు అధ్వానంగా మారింది. టీడీపీ హయంలో టెండర్ ఖరారు చేస్తే ఈ ప్రభుత్వం రద్దు చేసింది. ఇప్పుడు ఇది జాతీయ రహదారిగా మార్చారు. రహదారిని తొందరగా పూర్తి చేసే బాధ్యత తీసుకుంటాం. సత్తెనపల్లి నుంచి అచ్చెంపేట దారిలో రైల్వే హైలైన్ బ్రిడ్జి శాంక్షన్ చేస్తాం. సత్తెనపల్లిలో డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరిస్తాం. అధ్వానంగా ఉన్న నకిరేకల్-అమరావతి మేజర్ కాలువ రోడ్డును అభివృద్ధి చేస్తాం. అమరావతి పూర్తైతే సంపద, ఉద్యోగాలు వస్తాయి.. అమరావతి ప్రజరాజధానిగా ప్రపంచంలోనే అగ్రభాగాన ఆదర్శంగా తయారు చేసే బాధ్యత నాది. మీరంతా చైతన్యంతో కులమతాలు, ప్రాంతాలకు అతీతంగా ఐకమత్యంగా కలిసి కూటమి గెలుపుకు కృషి చేసి.. పొత్తును ఆశీర్వదించాలని చంద్రబాబు నాయుడు ప్రజలను కోరారు.

## తెదేపా గూటికి జంగా కృష్ణమూర్తి

బీసీ నేత, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి తెలుగుదేశం పార్టీలో చేరారు. సత్తెనపల్లిలో నిర్వహించిన ప్రజాగళం ఎన్నికల సభలో పార్టీ అధినేత చంద్రబాబు కండువా కప్పి జంగాను పార్టీలోకి చేర్చుకున్నారు. రాష్ట్రం కోసం ఎమ్మెల్సీ పదవిని వదులుకుని పార్టీలోకి వచ్చిన జంగాను చంద్రబాబు అభినందించారు. తెదేపా కోసం చిత్తశుద్ధితో పని చేస్తానంటూ ఈ సందర్భంగా జంగా కృష్ణమూర్తి, చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.





# ఇక రావణ అంతమే!

క్రోసూరు (చైతన్య రథం): 'రాముడు దేవుడైనప్పటికీ.. వానరులతో కలిసి పోరాడాడు. ఆఖరికి ఉడత కూడా సాయం అందించింది. రాష్ట్రంలో రావణాసురుడిని అంతం చేసేందుకే భాజపాతో కలిశాం. కేంద్రంలో మళ్లీ వచ్చేది ఎన్డీయే సర్కారే. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కేంద్రం సహకారం అవసరం. తెదేపా, జనసేన, భాజపా కలిసింది రాష్ట్రం కోసమే' అని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఉద్ఘాటించారు. పల్నాడు జిల్లా క్రోసూరులో నిర్వహించిన ప్రజాగళం బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రావణాసురుడిని చంపేందుకు వానర సైన్యమంతా కలిసిందన్నారు. ఇక జరగాల్సింది రావణాంతమేనని పిలుపిచ్చారు. జగన్ శవాలతో వస్తుంటే టీడీపీ నాయకులతో వస్తోందన్నారు. ప్రజలు తమ బతుకులకు భద్రత కోరుకుంటున్నారు. మీకు అండగా ఉంటానన్న భరోసా ఇవ్వడానికే ప్రజాగళం ద్వారా మీ ముందుకొచ్చానని చంద్రబాబు అన్నారు. వైసీపీలో మైనారిటీకి అన్యాయం జరిగింది. అధికారంలో ఎన్డీయేవున్నా ఏ మైనారిటీకి అన్యాయం జరగనివ్వనని చంద్రబాబు హామీ ఇచ్చారు.

- వానరసేనతో కలిసి వస్తున్నా
- మైనారిటీల సంక్షేమం ఎన్డీయేతోనే సాధ్యం
- ప్రజా ప్రభుత్వంలో ఉచితంగా ఇసుక
- నిర్మాణ రంగాన్ని నిలబెట్టుకుంటాం
- జగన్ వ్యతిరేక ఓటు చీలికూడదు
- ప్రజలంతా అప్రమత్తం కావాలి

**పెదకూరపాడు ప్రజాగళంలో చంద్రబాబు పిలుపు**



**ముస్లిం మహిళలకు రక్షణనిస్తా**

నందికొట్కూరులో ముస్లిం మహిళ నమాజ్ చేసుకొని వస్తుంటే వైసీపీ దొంగ ఆమెను బలవంతంగా బుర్కా తీసి దొంగ అనే విధంగా మాట్లాడాడు. ఆ మహిళ భర్తకు చెప్పి, కుమారుడితో కలిసి వెళ్లి నిలదీస్తే చెప్పుతో కొట్టాడు. ఒక ముస్లిం ఆడబిడ్డకి ఇలా జరిగిందంటే బాధ వేస్తుంది. శాప్ ఛైర్మన్ సిద్ధార్థరెడ్డి అనుచరుడు శ్రీనివాస్‌రెడ్డికి జగన్ అండ పుష్కలంగా ఉంది. ముస్లింలకు అన్యాయం జరిగితే కనీసం కేసు పెట్టరా? టీడీపీ హయాంలో ఎప్పుడైనా ఇలాంటి సంఘటనలు జరిగాయా? అని చంద్రబాబు ప్రశ్నించారు. పలమనేరులో టెన్త్ చదివే మిస్బా మొదటి ర్యాంక్ స్టూడెంట్. సునీల్ అనే వైసీపీ నాయకుడి వేధింపులు భరించలేక ఆత్మహత్యకు పాల్పడింది. నంద్యాలలో అబ్దుల్‌సలాం కుటుంబం వైసీపీ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంది. మాచర్లలో పిన్నెల్లి గ్రామంలో 100 కుటుంబాలు ఐదేళ్ల తరువాత ఇప్పుడు గ్రామానికి వచ్చాయి. గురజాలలో మైనారిటీ బాలికపై కాసు మహేష్‌రెడ్డి అనుచరుడి అత్యాచారానికి పాల్పడితే ఇంతవరకు చర్యలు లేవు. మైనార్టీలకు రక్షణ లేకుండా చేసిన వైసీపీని ఉపేక్షించేది లేదు. మైనారిటీ కుటుంబాలకు తెలుగుదేశం అండగా ఉంటుందని చంద్రబాబు హామీ ఇచ్చారు.

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు చెబుతూ, టీడీపీ ఉన్నప్పుడు రంజాన్ పండుగకు తోఫా అందించాం. ముస్లిం సోదరులకు న్యాయం చేసేందుకు ఇమామ్, మౌజన్‌లను గౌరవ వేతనం ఇచ్చాం. ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేసిన పార్టీ టీడీపీ. ఉర్దూ యూనివర్సిటీ, హజ్ హౌస్, షాదీఖానాలు కట్టాం. జగన్‌రెడ్డి మైనారిటీకి ఒక్క రూపాయి ఖర్చు పెట్టాడా? ఒక్క మసీదుకైనా జగన్ డబ్బులిచ్చారా? అని ప్రశ్నించారు.

**ఇకపై ఉచిత ఇసుక**

పెదకూరపాడు నియోజకవర్గం అంటే పవిత్రమైన అమరావతి, అమరలింగేశ్వరుడు గుర్తుకొస్తారు. కాని ఇప్పుడు అమరావతి అంటే ఇసుక బకాసురుడు శంకరరావు గుర్తుకొస్తున్నాడు. హెూల్‌సేల్ దోపిడీ దొంగలు గద్దెపైనున్నారు. 40 లక్షలమంది భవన నిర్మాణ కార్మికుల పొట్టగొట్టి జగన్, శంకర్‌రావులు పొట్ట నింపుకుంటున్నారు. కృష్ణానది మీదే రోడ్డు వేసి ఇసుక దోచుకుంటున్నారు. ఈ దందా ఇక సాగనివ్వను. ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపుతాను. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉచిత ఇసుక అందిస్తాను. నిర్మాణ కార్మికుల పొట్టగొట్టిన ఫ్యాను రెక్కలు ముక్కలవ్వాలి. వైసీపీని సమాధి కట్టేందుకు తాపీ మేస్త్రీలు సిద్ధం కావాలని పిలుపిచ్చారు. 1995-2004, 2014-19లోనూ తెలుగుదేశం ఎన్డీయేలో భాగస్వామేనని, ఆనాటి పాలనలో ఏ మైనారిటీకి అన్యాయం జరగలేదని గుర్తుచేశారు. హైదరాబాద్, సైబరాబాద్ నిర్మాణ స్ఫూర్తితో అమరావతి నిర్మాణానికి సంకల్పిస్తే రైతులు స్వచ్ఛందంగా భూములిచ్చారన్నారు. అమరావతి పూర్తైవుంటే ప్రజల జీవితాలు మారిపోయి ఉండేవని, కానీ జగన్‌రెడ్డి అమరావతిని సర్వనాశనం చేశాడన్నారు. అమరావతి పూర్తైవుంటే ప్రభుత్వానికి లక్షల కోట్లు ఆదాయం వచ్చి ఉండేదని, వాటిని ప్రజలకు మంచి పథకాలతో సంక్షేమాన్ని అందించగలిగేవాళ్లమన్నారు. అమరావతి కావాలని ఇసుకాసుర శంకర్‌రావు జగన్‌ను ఏనాడైనా ప్రశ్నించారా? అదే లావు శ్రీకృష్ణదేవరాయలు అమరావతికి మద్దతు పలికి వైసీపీనుంచి బయటకు వచ్చారని చంద్రబాబు అన్నారు.

**చంద్రన్నా అని పిలిస్తే వస్తా..**

మత్తులో మునిగితేలుతున్న రాష్ట్రంలో 100 రోజుల్లో గంజాయి, డ్రగ్స్‌ని నిర్మూలిస్తానని చంద్రబాబు స్పష్టం చేశారు. నాసిరకం మందును అధిక ధరలకు అందిస్తూనే, ఆన్‌లైన్ పేమెంట్స్ లేకుండా క్యాష్ అమ్మకాలతో జగన్ వేల కోట్లు దోచేశాడని, ప్రజారోగ్యాన్ని సర్వనాశనం చేశాడని చంద్రబాబు దుయ్యబట్టారు. యువత భవిష్యత్‌ను నిర్వీర్యం చేస్తున్నాడు. పల్నాడు జిల్లాలో వేలాదిమంది యువత విదేశాల్లో స్థిరపడటానికి కారణం టీడీపీనే. ఇప్పుడు జగన్ ఇంగ్లీష్ నేర్పిస్తున్నారని అంటున్నారు. ఇంగ్లీష్ రాకుండానే యువత విదేశాల్లో స్థిరపడ్డారా? అని ప్రశ్నించారు. 'యువతకంటే 20 ఏళ్ల ముందుటాయి నా ఆలోచనలు. 2000లోనే విజన్ 2020 అని చెప్పాను. 2047లో 100 ఏళ్ల స్వాతంత్ర్యదినంగా దేశం నెంబర్‌వన్ స్థానంలో ఉంటుదనేది నా అభిమతం. అందులో పేదరికంలేని రాష్ట్రంగా ఏపీ ఉండాలి. 20 లక్షల ఉద్యోగాలు, మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ ఇస్తాం. ఉద్యోగం వచ్చే వరకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తాం. చంద్రన్న అని పిలిస్తే మీ ఇంటికి వచ్చి ఆదుకుంటాను. వర్క్ ఫ్రం హెూం తెస్తా. అవసరమైతే పెదకూరపాడులోనే ఐటీ పార్కు పెడతాం. స్కిల్ డవలప్‌మెంట్ శిక్షణ ఇప్పిస్తాం. యువత ఎక్కడున్నా నెంబర్‌వన్‌గా ఉండాలన్నదే ఆ ఆలోచన, ఆశ' అన్నారు చంద్రబాబు

**ఏబీసీడీలు తెలియని వ్యక్తి జలవనరుల మంత్రా?**

వైసీపీ ఏలుబడిలో రైతులు ఆనందంగా ఉన్నారా? అని నిలదీశారు. నాశిరకం విత్తనాలు, మద్దతు ధర లేకపోవడం, సాగునీటి సమస్య.. అన్నీ కష్టాలేనన్నారు. నాడు పట్టిసీమను పూర్తి చేసి 130 టీఎంసీలు నీళ్లు తెచ్చి కృష్ణా బ్యారేజీతో డెల్టాను స్థిరీకరించి, అక్కడ నుంచి నీళ్లు నాగార్జునసాగర్ కుడి కాల్వకు తెచ్చాం. వైకుంఠపురం బ్యారేజీ కట్టి ఎత్తిపోతలతో నకిరేకల్లుకు నీళ్లు తెచ్చి రైట్ మెయిన్ కెనాల్ ద్వారా నీళ్లు ఇవ్వాలని ప్రయత్నించాం. మళ్లీ అధికారలోకి వచ్చి ఉంటే ఈ పనులు పూర్తయ్యేవి అన్నారు. పోలవరం 72 శాతం పూర్తి చేశాం. మిగిలిన పనులు పూర్తి చేయలేకపోయారు. డయాఫ్రం వాల్, కాఫర్ డ్యాం, గైడ్‌బండ్‌లు నాశనం చేశారు. ఏబీసీడీలు తెలియని అంబోతు రాంబాబును జలవనరుల శాఖ మంత్రిని చేయడం వల్ల దుష్పరిణామాలివి అని చంద్రబాబు వివరించారు. రైతును రాజును చేసే బాధ్యత తీసుకుంటానని, ప్రతి రైతుకు ఏటా పంట పెట్టుబడికి రూ.20వేలు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. సాగు నీటి ప్రాజెక్టులు పూర్తి చేసి.. సబ్సిడీలు అందించి రైతును రాజు చేస్తానన్నారు.

**పేదల జీవితాల్లో వెలుగు సూపర్ సిక్స్**

మీ జీవితాల్లో సూపర్ 6 మార్పు తెస్తుంది. సంపద సృష్టించడం తెలిసిన పార్టీ టీడీపీ. పోలవరం సహా ప్రాజెక్టులు పూర్తి చేస్తే రైతులు వాణిజ్య పంటలతో ఎక్కువ సంపాదిస్తారు. తద్వారా పన్నులు ప్రభుత్వానికి వస్తాయి. అమరావతి నిర్మాణం పూర్తయితే అవకాశాలు పెరిగి ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. దాంతో సంక్షేమ పథకాలు అమలు చేయొచ్చు అన్నారు. ఆడబిడ్డ నిధితో ప్రతి మహిళకూ నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18000 అందిస్తా. తల్లికి వందనంతో బిడ్డను బడికి పంపే ప్రతి తల్లికీ రూ.15,000 ఇస్తా. గతంలో దీపం తెచ్చా. నేడు అధికారంలోకి రాగానే మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తాం. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తా. ప్రతి ఇంటికి ట్యాప్ ద్వారా నీళ్లు ఇచ్చే బాధ్యత నాది. సాగు, తాగు నీరు పెదకూరపాడుకి ఇచ్చే బాధ్యత యువగళం తీసుకుంటుందని హామీనిచ్చారు. దానిని పూర్తి చేస్తామన్నారు.

**ఏప్రిల్ నుంచే రూ.4,000 పెన్షన్ ఇస్తాం**

జగన్ రూ.10 ఇచ్చి రూ.100 దోచేస్తున్నారు. 1.30 లక్షలమంది సచివాలయం ఉద్యోగులతో పెన్షన్ ఇంటి దగ్గరే ఇప్పించలేకపోయారు. అందుకే జగన్ రాజీనామా చేయమని డిమాండ్ చేశాం. అవ్వాతాతలకు పెన్షన్ ఇంటి వద్దే ఇచ్చే బాధ్యత మాది. రూ.200 పెన్షన్ రూ.2000 చేసింది టీడీపీనే. ఏప్రిల్ నుంచి రూ.4,000 పెన్షన్ ఇంటి వద్దే అందించే బాధ్యత ఎన్డీఏది. ఏప్రిల్, మే, జూన్ నెలలకు కలుపుకొని అదనంగా డబ్బులు ఇస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు.

ఎమ్మార్పీఎస్‌కు న్యాయం చేసింది టీడీపీయేనంటూ, ఎవ్వరికి అన్యాయం జరగకుండా ఏ,బీ,సీ,డీ వర్గీకరణ చేసి మాదిగలకు న్యాయం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. జగన్‌రెడ్డి వ్యతిరేక ఓట్లు చీల్చేందుకు కుట్రలు పన్నుతున్నారు. జరుగుతున్న రాజకీయ పరిణామాలను ప్రజలు జాగ్రత్తగా గమనించి, ఎన్డీయేను గెలిపించాలని బాబు పిలుపునిచ్చారు. జగన్‌రెడ్డి వ్యతిరేక ఓటు చీలిపోతే రాష్ట్రం తీవ్ర కష్టాల్లో పడుతుందని హెచ్చరించారు.

**తెలుగు తమ్ముళ్ల జోలికొస్తే అంతే..**

ఇసుకాసురుడు శంకర్‌రావు ఇసుక గుంతల్లో పడి 12మంది చనిపోయారు. ఇంటి స్థలాల్లో 300 ఎకరాలు తక్కువ ధరకు కొని ఎక్కువకు అమ్ముకున్న ప్రబుద్ధుడు. వాళ్ల రౌడీ ఇజానికి భయపడేది లేదు. మా తమ్ముళ్ల జోలికి వస్తే ఖబర్దార్, భవిష్యత్‌లో వడ్డీతో తిరిగిస్తాం. మర్యాదకు మర్యాద. హద్దు దాటితే ఉగ్రరూపం చూపిస్తామని చంద్రబాబు హెచ్చరించారు. పెదకూరపాడు అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానన్నారు. పెదకూరపాడు, అచ్చంపేట, బెల్లంకొండలో జూనియర్ కాలేజీలు ఏర్పాటు చేస్తామని, మద్దువరపు బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలన్నారు. అమరావతి నుండి బెల్లంకొండకు డబుల్ రోడ్డు వేస్తామన్నారు. అమరేశ్వర ఆలయానికి రూ.26కోట్లు మంజూరు చేస్తే పెండింగ్‌లో పెట్టారంటూ, అంబటిపూడి లిఫ్ట్ ఇరిగేషన్‌కు మరమ్మత్తులు పూర్తి చేస్తామన్నారు.

చైతన్యరథం















# కదంతొక్కిన ప్రజాగళం

పెదకూరపాటు నియోజకవర్గంలోని క్రోసూరులో శనివారం నిర్వహించిన ప్రజాగళం ఎన్నికల సభకు జనం పోటెత్తారు. ప్రజలను, పార్టీ శ్రేణులను చైతన్యపరుస్తూ తెదేపా అధినేత చంద్రబాబు మాట్లాడుతున్నంతసేపూ హర్షధ్వానాలతో ఉత్సాహాన్ని ప్రదర్శించారు. చంద్రబాబును కలవడానికి, ఆయన ప్రసంగాన్ని వినడానికి మారుమూల పల్లెల నుంచీ పెద్దఎత్తున మహిళలు హాజరవ్వడంతో ఎన్నికల సభకు నిండుదనం వచ్చింది. సభకు ముందు చంద్రబాబు నిర్వహించిన రోడ్డు షోకి మహిళలు నీరాజనాలు పలికారు. ముసలీ ముతకా, పిల్లా పాపా, యువకులు, మహిళలు చంద్రబాబుకు విజయ సంకేతానికి స్పందిస్తూ చేతులూపుతూ టాటాలు చెప్పారు. సభ జరుగుతున్నంతసేపూ క్రోసూరు నలుచెరుగులా తెలుగుదేశం అభిమానులతో కిటకిటలాడింది. రోడ్డుషోలో అడుగడుగునా ఆగుతూ, తనకోసం ఎదురు చూస్తున్న ప్రజలను ఆనందంగా పలకరిస్తూ.. రాష్ట్ర పునర్నిర్మాణానికి తనతో కలిసి రావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. పెదకూరపాటు ప్రజాగళం ఉత్సాహంగా.. ఉల్లాసంగా సాగింది.









## నేడు కృష్ణా జిల్లాలో చంద్రబాబు ప్రజాగళం

**- పామర్రు, ఉయ్యూరులో సభలు**

అమరావతి (చైతన్యరథం): టీడీపీ అధినేత చంద్రబాబు ఆదివారం కృష్ణాజిల్లాలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు. మచిలీపట్నం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని పామర్రు, పెనమలూరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగే ప్రజాగళం బహిరంగసభల్లో చంద్రబాబు పాల్గొంటారు. శనివారం రాత్రి పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో బసచేసిన చంద్రబాబు ఆదివారం ఉదయం 10.30 గంటలనుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పార్టీ నాయకులతో సమావేశమవుతారు. తరువాత మధ్యాహ్నం 2.10 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 2.35కి పామర్రు చేరుకుంటారు. 3 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు పామర్రులోని ఎన్టీఆర్ విగ్రహం సెంటర్‌లో జరిగే ప్రజాగళం సభలో చంద్రబాబు పాల్గొని, అనంతరం రోడ్డు మార్గం ద్వారా పెనమలూరు నియోజకవర్గంలోని ఉయ్యూరు చేరుకుంటారు. సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 7.30 వరకు ఉయ్యూరులోని మార్కెట్ సెంటర్‌లో జరిగే ప్రజాగళం సభలో పాల్గొంటారు.

## నా..నా...అంటూనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలపై వరుస దాడులు!

***జగన్ రెడ్డిపై మండిపడ్డ లోకేష్***



అమరావతి(చైతన్యరథం): అధికార మదంతో విర్రవీగుతున్న జగన్‌రెడ్డికి, అతడి బ్యాచ్‌ని ఈ సారి ఎన్నికల్లో బడుగు, బల హీన, మైనారిటీ వర్గాలు కలిసికట్టుగా పాతరే యటం ఖాయమని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. నోటితో పొగిడి.. నొసటితో వెక్కిరించి నట్లుగా ఉంది ముఖ్యమంత్రి జగన్ రెడ్డి తీరు ఉందన్నారు. నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనారిటీలు అంటూ జగన్ బహిరంగ వేదికలపై ప్రేమ కురిపిస్తుంటే... క్షేత్రస్థాయిలో మాత్రం వైసీపీ మూకలు ప్రతిరోజూ ఆయా వర్గాలపై దాడులకు తెగబడుతూ అణచివేత చర్యలకు పాల్పడుతున్నాయని లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కడప జిల్లా పెండ్లిమర్రిలో జగన్ మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి అనుచరులు శ్రీనివాసులు అనే బీసీ యువకుడ్ని హత్యచేసి 24గంటలు కూడా గడవకుండానే తాజాగా నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అనుచరుడు శ్రీనివాసరెడ్డి నమాజ్‌కు వెళ్లివస్తున్న ముస్లిం మహిళను బురకా తొలగించి తీవ్రంగా అవమానించడమేగాక, అదేమని ప్రశ్నించిన నేరానికి ఆమె భర్త, కుమారుడిపై చెప్పుతో దాడికి తెగబడ్డాడు. అధికారమదంతో విర్రవీగుతున్న జగన్ అండ్ కో కు మరో 37రోజుల్లో జరిగే ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలంతా కలసి ఘోరీ కట్టడం ఖాయమని లోకేష్ హెచ్చరించారు.

## వాలంటీర్ల ద్వారానే రూ.4వేల పింఛన్ ఇళ్లవద్ద ఇస్తాం!

**- రాజకీయ లబ్ధి కోసం కుల,మతాల పేరుతో జగన్ చిచ్చు**

**- మంగళగిరి నియోజకవర్గ రచ్చబండ సభల్లో నారా లోకేష్**



మంగళగిరి(చైతన్యరథం): వాలంటీర్లను వైసీపీ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకున్నందు వల్లే వారిపై ఎన్నికల కమిషన్ ఆంక్షలు విధించింది.. రాబోయే ఎన్నికల్లో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వందరోజుల్లో వాలంటీర్ల ద్వారానే 4వేల రూపాయల పింఛన్‌తో పాటు ఇతర సంక్షేమ పథకాలు అందజేస్తామని యువనేత నారా లోకేష్ చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మంగళగిరి నియోజకవర్గం రేవేంద్రపాడు రచ్చబండ సభలో లోకేష్ మాట్లాడుతూ... పింఛన్ల విషయంలో జగన్ తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. దేశంలో తొలిసారి పింఛన్ ప్రవేశపెట్టింది అన్న ఎన్టీఆర్. 200 రూపాయల పెన్షన్‌ను రూ.2వేలకు పెంచింది చంద్రబాబు.

ఎన్నికల తర్వాత రూ. 4వేలు ఇచ్చేది కూడా చంద్రబాబేనని అన్నారు. ముఖ్య మంత్రి జగన్ కుల, మతాల పేరుతో చిచ్చుపెట్టి రాజకీయంగా లబ్ధిపొందాలని చూస్తున్నారని లోకేష్ మండిపడ్డారు. 2014-19 మధ్య టీడీపీ పాలనలో ఏనాడూ ముస్లిం మైనారిటీలపై దాడులు జరగలేదు. జగన్ అధికారంలోకి వచ్చాక నంద్యాలలో అబ్దుల్ సలామ్ కుటుంబాన్ని, పలమనేరులో మిస్బా అనే బాలికను ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించారు, నర్సరావుపేటలో మసీదు ఆస్తుల పరిరక్షణకు పోరాడిన ఇబ్రహీంను నరికి చంపారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో రంజాన్ తోఫా, దుల్హాన్ పథకాలు అమలు చేశాం. ఇమామ్, మౌజమ్ లకు గౌరవ వేతనాలు అందించాం. మైనారిటీల క్షేమాన్ని కాంక్షించేది ఎవరో ముస్లిం సోదరులు గుర్తించాలి. రాబోయే ఎన్నికల్లో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముస్లిం మైనారిటీలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటాం. దళితులపై కూడా జగన్ ప్రభుత్వం కక్షగట్టినట్లుగా వ్యవహరిస్తోంది. గత ప్రభుత్వం ఎస్సీల కోసం ప్రవేశపెట్టిన 27సంక్షేమ పథకాలను జగన్ రద్దుచేశారు. దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యంను చంపి డోర్ డెలివరీ చేసిన సుబ్రహ్మణ్యంను జగన్ పక్కన కూర్చొబెట్టి సమీక్షలు చేస్తున్నారు. జగన్ కపటప్రేమను దళితులు, మైనారిటీలు గమనించాలని లోకేష్ విజ్ఞప్తిచేశారు.

# అందరం కలిసి కౌరవమూకను తరిమికొడదాం

**- ప్రజలకు చంద్రబాబు పిలుపు**

**- మైనారిటీ మహిళ బురఖా తొలగించటంపై ఫైర్**

**- వైసీపీ నేతలు అహంకారంతో విర్రవీగుతున్నారని ఆగ్రహం**



అమరావతి(చైతన్యరథం): మైనారిటీ మహిళ బురఖాను తొలగించే స్థాయికి వైసీపీ నేతల అహంకారం చేరుకుందని టీడీపీ అధినేత చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. నంద్యాల జిల్లా నందికొట్కూరులో వైసీపీకి చెందిన మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు ఒక మైనారిటీ సోదరి పట్ల అనుచితంగా వ్యవహరించడం, ప్రశ్నించిన బాధితులపైనే తిరిగి దాడి చేయడం రాష్ట్రంలో అరాచక పాలనకు నిదర్శమని ధ్వజమెత్తారు. మత ఆచారాలను గౌరవించని, మహిళల మనోభావాలకు విలువివ్వని ఇలాంటి కౌరవ మూకను మే 13న అన్ని వర్గాలు ఏకమై తరిమికొడదామని చంద్రబాబు పిలుపు ఇచ్చారు.

# ముస్లింల ద్రోహి జగన్ రెడ్డి

- **ముస్లింలపై జాతి అహంకారంతో విర్రవీగుతున్న జగన్ రెడ్డి అండ్ కో**
- **రంజాన్ మాసంలో ముస్లింలపై వైసీపీ దాడులు చేస్తుంటే డీజీపీ ఏం చేస్తున్నారు?**
- **'ముస్లింలను నమ్మకూడదు' అని అవమానించిన వైసీపీకి ఓటుతో బుద్ధిచెప్పాలి**
- **టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ధ్వజం**



అమరావతి(చైతన్యరథం):పవిత్ర రంజాన్ మాసంలో కూడా ముస్లింలపై వైసీపీ వైధింపుల పర్వం కొనసాగుతోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. నంద్యాలలో ముస్లిం యువతికి జరిగిన అవమానాన్ని తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. జగన్ రెడ్డి పాలనలో ముస్లింలకు రక్షణ లేదు.. ముస్లింలంటే తమ కాళ్ల దగ్గర పడి ఉండే వాళ్లలా భావిస్తూ జాతి అహంకారంతో జగన్ రెడ్డి వర్గం విర్రవీగుతోందని ఒక ప్రకటనలో అచ్చెన్నాయుడు దుయ్యబట్టారు. నంద్యాల జిల్లా నందికొట్కూరులో నమాజ్ చేసుకొని వస్తున్న ముస్లిం మహిళను బురఖా తొలగించి వైసీపీ నాయకుడు, నంది కొట్కూరు మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి పరాభవానికి గురి చేశాడు. ముస్లింలను నమ్మకూడదంటూ ముస్లిం జాతినే అవమానించారు. ఆమె కుమారుడిపై దాడి చేయించారు. మొన్న శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణంలో వైసీపీ అభ్యర్థి మగ్బూల్ బంధువు, మాజీ కౌన్సిలర్.. వహీద అనే ముస్లిం మహిళపై చెప్పుతో దాడి చేసి అవమానించారు. ఇలా రోజుకో చోట అవమానిస్తున్నారు.

గతంలోనూ వైసీపీ నాయకుల ఒత్తిడి తట్టుకోలేక నంద్యాల జిల్లాలో అబ్దుల్ సలాం కుటుంబం ఆత్మహత్య చేసుకుంది. చిత్తూరు జిల్లా పలమనేరులో బాలిక మిస్బా ఆత్మహత్య చేసుకుంది. 5ఏళ్లల్లో ముస్లింలపై 60కి పైగా దాడులు, 15 మందికి పైగా అత్యాచారాలు, 9 మంది హత్యలు, వేలాది మందికి అవమానాలు జరిగాయి. పరమ పవిత్రమైన రంజాన్ మాసంలో ఉపవాసాలుండే ముస్లింలపై ఏటికేడు వైసీపీ దాష్టీకాలు పెరిగిపోతు న్నాయి. గత ఏడాది పెదకూరపాడులో ముస్లిం యువకుడిపై పోలీసులతో దాడిచే యించారు. వైసీపీ నాయకుల వేధింపులతో ఇంకెంత మందిని బలితీసుకుంటారు. తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ముస్లింల పక్షాన నిలిచింది. ముస్లింలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించి ఆత్మగౌరవంతో జీవించేలా చర్యలు తీసుకుంది. శాంతిభద్రతలను కాపాడిందని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# జగన్ మరోసారి వస్తే రాష్ట్రానికి అధోగతే!

- **జగన్ రెడ్డి హయాంలో రెవెన్యూ లోటు 4 రెట్లు, ద్రవ్యలోటు 2 రెట్లు పెరిగింది**
- **సుస్థిరాభివృద్ధి సూచీలో 13 వ స్థానానికి, మానవాభివృద్ధి సూచీలో 21వ స్థానానికి దిగజారింది**
- **టీడీపీ సీనియర్ నేత యనమల విమర్శలు**



అమరావతి(చైతన్యరథం): జగన్‌రెడ్డి తిరిగి అధికారంలోకి వస్తే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇక కోలుకోలేని స్థితికి చేరుకుంటుందని తెలుగు దేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, శాసనమండలి ప్రతిపక్షనేత యనమల రామకృష్ణుడు అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం రెండవ రోజునే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నుంచి ప్రభుత్వ సెక్యూరిటీల వేలంలో రూ.4వేల కోట్లు అప్పులు తెచ్చిన జగన్ రెడ్డి తిరిగి అధికారంలోకి వస్తే రాష్ట్రానికి అధోగతేనని తీవ్రంగా విమర్శించారు. 2023-24 లో ఆర్‌బిఐ నుంచే కేవలం మంగళవారం అప్పులే రూ.70 వేల కోట్లు చేసిన జగన్ రెడ్డి రాష్ట్రాన్ని ఐదేళ్లలో 13 లక్షల కోట్ల అప్పుల్లో ముంచాడన్నారు. కాగ్ లెక్కల ప్రకారమే గత ఆర్థిక సంవత్సరం జగన్ రెడ్డి ప్రభుత్వం రోజుకు రూ.257 కోట్లు చొప్పున మొత్తం రూ.93,805 కోట్లు అప్పు చేసిందన్నారు. బడ్జెట్‌లో శాసనసభకు చెప్పి చేస్తామన్న అప్పులు, ఎఫ్ఆర్‌బిఎం పరిమితుల కంటే ఇది రెండింతలు ఎక్కువన్నారు. ఇది చాలక రాబోయే ప్రభుత్వాలు తీసుకోవాల్సిన అప్పులను సైతం జగన్ రెడ్డే చేసేయడం దుర్మార్గం. మరోసారి అధికారంలోకి రానని తెలుసుకున్న జగన్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల కోడ్ ఉండగానే 2024-25 ఆర్థిక సంవత్సరం అప్పుల్లో రూ.20 వేల కోట్లు జూన్ 4 లోపే తీసుకునేందుకు కేంద్రం నుంచి అప్పుల సమీకరణకు అనుమతులు తీసుకుంది. ఏడాది మొత్తానికి తీసుకోవాల్సిన అప్పుల్లో మూడోవంతు అప్పు మొదటి రెండు నెలల్లోనే తీసుకుని కొత్త ప్రభుత్వంపై శఠగోపం పెట్టాలని జగన్‌రెడ్డి చూస్తున్నాడని యనమల ధ్వజమెత్తారు.

**ప్రమాదకరంగా ఆర్థిక వ్యవస్థ**

2019లో తెలుగుదేశం ప్రభుత్వం దిగిపోయే నాటికి రూ.13 వేల కోట్లు ఉన్న రెవెన్యూ లోటు 2024 ఫిబ్రవరి నాటికి రూ.53 వేల కోట్లకు, ద్రవ్యలోటు రూ.35 వేల కోట్లు నుంచి రూ.77వేల కోట్లకు చేరుకుంది. ఇది తెదేపా హయాం కంటే రెవెన్యూ లోటులో నాలుగు రెట్లు, ద్రవ్యలోటులో రెండు రెట్లు అధికం. రాష్ట్రానికి ఆస్తులు కల్పన చేసే మూలధన వ్యయంపై స్థూల ఉత్పత్తిలో 0.5 శాతం కూడా ఖర్చు చేయడం లేదు. ఇది ఆర్థికపరంగా చాలా ప్రమాదకరమైన పరిస్థితి. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి శూన్యం. టీడీపీ ఐదేళ్ల హయాంలో పరిశ్రమల ద్వారా కల్పించబడిన ఉద్యోగాలు 13,88,733 అయితే.. జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో అవి కేవలం 9,158 మాత్రమే. రాష్ట్రంలో ప్రధాన రంగాలైన వ్యవసాయం, పరిశ్రమలు, సేవల రంగాలు దెబ్బతిన్నాయి. వివిధ రంగాలకు బడ్జెట్ లో కేటాయించిన మొత్తాలలో సగానికి కన్న తక్కువగానే ఖర్చు చేశారు. కానీ, రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరిగిందని తప్పుడు లెక్కలు చెబుతున్నారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తిపై వైకాపా ప్రభుత్వం చెప్పేవన్నీ దొంగ లెక్కలే. జగన్ రెడ్డి పాలనలో పేదలు మరింత పేదలయ్యారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సూచీలో మన రాష్ట్రం 13 వ స్థానానికి పడిపోయింది. హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇండెక్స్‌లో మనది 21 వ స్థానానికి పడిపోయింది. దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, తమిళనాడు, కర్ణాటకలు పేదరిక నిర్మూలనలో మనకంటే ఎంతో మెరుగైన స్థానాల్లో ఉన్నాయి. మన కంటే వనరులు తక్కువ ఉన్న తెలంగాణ ఏపీ కంటే మెరుగైన స్థానంలో నిలిచింది. రాష్ట్రాన్ని ఆర్థిక అధోగతి పాలుకాకుండా కాపాడుకోవాలంటే జగన్ రెడ్డిని ఓడించాల్సిందే. అప్పులతో కొనసాగే సంక్షేమ రాజ్యం ఎప్పటికైనా కూలిపోక తప్పదు. పేదలను సుస్థిరాభివృద్ధి వైపు నడిపించాలంటే అభివృద్ధితో కూడిన సంక్షేమం అందించే ఎన్డీఏ కూటమిని గెలిపించాలని యనమల పిలుపు ఇచ్చారు.

# చంద్రబాబుతోనే ముస్లింలకు భద్రత, సంక్షేమం

## - ముస్లిం మహిళలతో మాటామంతి కార్యక్రమంలో భువనేశ్వరి ఉద్ఘాటన

- వైసీపీ పాలనలో ముస్లింలకు అడుగడుగునా వేధింపులు, అన్యాయమే
- చంద్రబాబు తెచ్చిన పలు పథకాలు రద్దు చేశారు
- యథేచ్ఛగా వక్ఫ్ భూముల కబ్జా
- వైసీపీ పాలనలో అంధకారంలో రాష్ట్రం
- ప్రజాప్రభుత్వాన్ని తెచ్చుకునేందుకు అందరూ కలసిరావాలి





నంద్యాల (చైతన్యరథం): ముస్లిం మైనారిటీల సంక్షేమం, భద్రత కోసం చంద్రబాబు నాయుడి హయాంలో పలు పథకాలు అమలు చేశారని ఆయన సతీమణి నారా భువనేశ్వరి చెప్పారు. గతంలో ఎన్డీఏ కూటమిలో టీడీపీ భాగస్వామిగా ఉన్నప్పటికీ రాష్ట్రంలో మైనారిటీలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చంద్రబాబు పాలన సాగించారన్నారు. ఇప్పుడు కూడా అసమర్థ పాలకుల చేతుల్లో దెబ్బతిన్న రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలో నడిపించాలంటే కేంద్ర సహకారం







అవసరమనే ఉద్దేశంతోనే ఎన్డీఏలో టీడీపీ చేరిందన్నారు. నంద్యాల ఎస్ఎన్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ముస్లిం మహిళలతో భువనేశ్వరి మాటామంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నంద్యాల మహిళలకు నమస్కారాలు అంటూ భువనేశ్వరి ప్రసంగం ప్రారంభించారు. ఇక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరికి అస్సలాం వాలేకుం. నేను రాజకీయాలు మాట్లాడడానికి ఇక్కడికి రాలేదు. మీలో ఒక స్త్రీగా మాత్రమే మీ దగ్గరకు వచ్చాను...మీ సమస్యలు తెలుసుకునేందుకు వచ్చాను. మీరు నాకు చెప్పిన ప్రతి సమస్యను నేను చంద్రబాబుకు చెబుతాను. రంజాన్ మాసం మీకు చాలా పవిత్రమైనది. ఈ మాసంలో మీరు అల్లాను తలచుకుంటూ ఉపవాసంలో ఉంటారు. మీరు కోరుకున్న ప్రతి కోరికను అల్లా తప్పకుండా తీరుస్తారని నేను ఆశిస్తున్నాను. నంద్యాల అంటే నాకు.. చంద్రబాబును జ్ఞానాపురం గ్రామం నుండి అక్రమంగా అరెస్టు చేసిన విధానం గుర్తుకొస్తుంది. చంద్రబాబు ఏ తప్పూ చేయకుండా, ఆధారాలు లేకుండా అక్రమంగా అరెస్టు చేశారు. చంద్రబాబును అరెస్టు చేసినప్పుడు మనోవేదనకు గురై గుండెపోటుతో మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలను పరామర్శించేందుకే నేను నిజం గెలవాలి అనే కార్యక్రమాన్ని ప్రారంభించాను. అన్న ఎన్టీఆర్ పేద, బడుగు, బలహీనవర్గాల వారి కోసం టీడీపీని స్థాపించారు. పేదవారికి కూడు, గూడు, గుడ్డ అందించాలనే లక్ష్యంతో ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారు...అధికారంలోకి వచ్చాక అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారు. చంద్రబాబు కూడా ఎన్టీఆర్ మార్గంలోనే పేదవారికి అనేక పథకాలు అమలు చేసి అండగా నిలిచారని భువనేశ్వరి చెప్పారు.

### వైసీపీ పాలనలో ముస్లింలకు అన్యాయం

నంద్యాల అంటే నాకు గుర్తుకొచ్చేది షేక్ అబ్దుల్ సలాం, అతని కుటుంబం. వైసీపీ వాళ్ల వేధింపులు తాళలేక కుటుంబం అంతా ఆత్మహత్య చేసుకుంది. చిత్తూరు జిల్లా పలమనేరులో మిస్బా చాలా చిన్న పిల్ల. చదువులో ముందుండడమే మిస్బా చేసిన తప్పా? వైసీపీ నేతల వేధింపులు తట్టుకోలేక మిస్బా ఆత్మహత్య చేసుకుంది. వైసీపీ పాలనలో ముస్లింలపై వేధింపులు పెరిగిపోయాయి. చంద్రబాబు ఒక మాట ఇచ్చారంటే.. దాన్ని ఆయన నిలబెట్టుకుంటారు. కానీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 45ఏళ్లు నిండిన మహిళలకు పెన్షన్లు ఇస్తామని చెప్పి నేటికీ అమలు చేయలేదు. ముస్లిం మహిళలకు దుల్హన్ పథకాన్ని రద్దు చేశారు. సబ్‌ప్లాన్ అమలు చేస్తామని మాట తప్పారు. నూనెపల్లి గ్రామం, 21వ వార్డులో రైల్వే ప్రాజెక్టును వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల అనేక మంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. 80శాతం వక్ఫ్ బోర్డు భూములను వైసీపీ నేతలు ఆక్రమించేశారు. వక్ఫ్ బోర్డుకు సంబంధించిన దాదాపు 30వేల ఎకరాలను కబ్జా చేశారు. ప్రార్థనా స్థలాలు, శ్మశానవాటికల స్థలాలను కూడా వైసీపీ నేతలు ఆక్రమించేస్తున్నారని భువనేశ్వరి అన్నారు.

### పరిశ్రమలను తరిమేశారు

ఉమ్మడి ఏపీలో చంద్రబాబు ఐటీ రంగాన్ని ముందుకు తెచ్చారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఆ రంగం అభివృద్ధిని కొనసాగించటం వల్ల నేడు కొన్ని లక్షల మందికి ఉపాధి అందుతోంది. రాష్ట్ర విభజన అనంతరం ఏపీలో చంద్రబాబు అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. చంద్రబాబు తెచ్చిన కంపెనీలను రాష్ట్రం నుండి తరిమేసి, రాష్ట్ర యువతను నిరుద్యోగులుగా మార్చారు. వైసీపీ పాలనలో రాష్ట్రానికి పరిశ్రమలు రావడం లేదు...ఏపీలో ఉన్న ప్రస్తుత పరిశ్రమలు భయపడుతూ కాలం గడుపుతున్నాయి. వాళ్ల వ్యాపారాలను పక్క రాష్ట్రాల్లో విస్తరించుకుంటున్నారు. టీడీపీ పాలనలో పరిశ్రమలు వచ్చేందుకు అవసరమైన సదుపాయాలను చంద్రబాబు, లోకేష్ కల్పించారు. అందుకే అన్ని కంపెనీలు వచ్చాయి. అందుకు నిదర్శనం కియా పరిశ్రమ అని భువనేశ్వరి అన్నారు.

### గంజాయి, డ్రగ్స్ రాజధానిగా మార్చారు

వైసీపీ పాలనలో రాష్ట్రం ఎంత నష్టపోయిందో నేను ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. వైసీపీ ప్రభుత్వం ఏపీని గంజాయి, డ్రగ్స్, ఇసుక మాఫియా, భూకబ్జాల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టింది. తాజాగా విశాఖలో 25వేల కేజీల డ్రగ్స్ దొరికాయి. రాష్ట్ర యువతను గంజాయి, డ్రగ్స్ మత్తులో దించి వైసీపీ నేతలు వారి జీవితాలతో ఆడుకుంటున్నారు. విశాఖను పరిపాలనా రాజధానిగా చేస్తామని చెప్పిన వైసీపీ ప్రభుత్వం నేడు గంజాయి, డ్రగ్స్ రాజధానిగా మార్చింది. వైసీపీ పాలనలో దేశంలోనే రాజధాని లేని రాష్ట్రంగా ఏపీని నిలబెట్టి అవమానిస్తున్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని అంధకారంగా మార్చారు...అక్రమ దారిలో వారి జేబులు నింపుకుంటున్నారు..అక్రమార్జన సొమ్మును ఇతర దేశాల్లో దాచుకుంటున్నారు. చంద్రబాబు మరో ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే రాజధాని అమరావతి పూర్తయ్యేది, పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేది. రాష్ట్రం సస్యశ్యామలం అయ్యేదని భువనేశ్వరి అన్నారు.

### ప్రజాప్రభుత్వాన్ని తెచ్చుకోవాలి

టీడీపీ అధికారంలోకి వచ్చాక చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తారు. వైసీపీ ప్రభుత్వానికి పేదవాళ్లకు పెన్షన్లు ఇవ్వడం చేతకాక ఆ నెపాన్ని చంద్రబాబు, టీడీపీపై నెట్టేసి ప్రజల్లో విష ప్రచారం చేస్తున్నారు. రాష్ట్ర ప్రజలు వైసీపీ కుట్రలను గమనించి రానున్న ఎన్నికల్లో ఓట్లు వేయాలి..ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకోవాలి. కుటుంబాన్ని ముందుకు నడపడానికి తండ్రి ఎంత ముఖ్యమో...రాష్ట్రాన్ని ముందుకు నడపాలంటే మంచి నాయకుడు కావాలి...ఆ నాయకుడే చంద్రబాబు. రానున్న ఎన్నికల కురుక్షేత్రంలో వైసీపీని గద్దె దించేందుకు ప్రతి ఒక్కరు తమ ఓటును ఆయుధంగా మలచుకోవాలి...సై అంటే సై అన్నట్లు పోరాడాలని భువనేశ్వరి పిలుపు ఇచ్చారు.



## టీడీపీ పాలనలో ముస్లింలకు పలు సంక్షేమ పథకాలు

టీడీపీ పాలనలో నంద్యాలలో 13వేల టిడ్కో ఇళ్లను కడితే వాటిని లబ్ధిదారులకు ఇవ్వకుండా వేధిస్తున్నారు. కేవలం తమకు నచ్చిన వారికి ఇచ్చి వివక్ష చూపుతున్నారు. టీడీపీ పాలనలో మైనారిటీ నేత షరీఫ్‌ను శాసనమండలి చైర్మన్‌ను చేశారు. లాల్‌జాన్ బాషాను పార్లమెంటు సభ్యుడిగా చేసింది. ముస్లింలను జెడ్పీ చైర్మన్లు, మేయర్లుగా చేసిన ఘనత టీడీపీది. 11లక్షల ముస్లిం కుటుంబాలకు రూ.140 కోట్లతో రంజాన్ తోఫాను 5ఏళ్ల పాటు చంద్రబాబు అందించారు. టీడీపీ పాలనలో రూ. 200 కోట్లు వెచ్చించి 38వేల మంది మైనారిటీ యువతులకు రూ.50వేలు చొప్పున దుల్హన్ పథకం కింద అందించారు. మైనారిటీలకు కార్పొరేషన్ ద్వారా 44వేల మందికి రూ.240 కోట్లను సబ్సిడీల కింద అందించారు. మైనారిటీ సంక్షేమశాఖ ద్వారా రూ.2,500కోట్లను టీడీపీ ప్రభుత్వం ఖర్చు పెట్టింది. ఏపీ నూర్‌బాషా దూదేకుల ముస్లిం కార్పొరేషన్ ఫండ్ ప్రారంభించి రూ.40కోట్లను ఖర్చు చేసింది. ఫీజు రీయింబర్స్‌మెంట్, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా విధానం, ఎన్టీఆర్ ఉన్నత విద్యాదరణ వంటి పథకాల ద్వారా 5.40 లక్షల మైనారిటీ విద్యార్థులకు రూ.1000కోట్ల లబ్ధి అందించారు. ఇమామ్ లకు రూ.5వేలు, మౌజన్ లకు రూ.3వేలు గౌరవ వేతనం అందించిన ఘనత టీడీపీది. 30,200మంది దీని ద్వారా లబ్ధి పొందారు. 100 యూనిట్ల వరకు కరెంటు బిల్లుపై సబ్సిడీని అందించారు. రంజాన్ తోఫా, దుల్హన్, దుకాన్-మకాన్, స్వయం ఉపాధి లోన్లు వంటి 10 పథకాలను చంద్రబాబు మైనారిటీలకు అందించారు. వైసీపీ ప్రభుత్వం ప్రతి పథకాన్ని రద్దు చేసి ముస్లింలకు అన్యాయం చేసిందని భువనేశ్వరి విమర్శించారు.

# బాధిత కుటుంబాలకు భువనమ్మ ఆప్యాయ పరామర్శ

## పార్టీ అండగా ఉంటుందని హామీ - పాణ్యం,నందికొట్కూరు నియోజకవర్గాల్లో నిజం గెలవాలి

పాణ్యం,నందికొట్కూరు (చైతన్యరథం): దేశంలో ఏ పార్టీకీ లేని కార్యకర్తల బలం టీడీపీ సొంతమని పార్టీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. కార్యకర్తలంటే మామూలు కార్యకర్తలు కాదని, పార్టీ కోసం, అధినేత కోసం ప్రాణాలు సైతం లెక్కచేయని బలగం అన్నారు. అలాంటి కార్యకర్తల కుటుంబాలను ఇబ్బందుల్లో ఆదుకోవటం తమ బాధ్యత అన్నారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా శనివారం నంద్యాల జిల్లా పాణ్యం, నందికొట్కూరు నియోజకవర్గాల్లో భువనేశ్వరి పర్యటించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు అక్రమ అరెస్ట్ సమయంలో మనస్తాపానికి గురై గుండెపోటుతో మృతి చెందిన పార్టీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి, ఆర్థికసాయం పత్రాలు అందచేసేందుకు నిజం గెలవాలి పేరుతో భువనేశ్వరి రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్న విషయం తెలిసిందే. పాణ్యం, నందికొట్కూరు నియోజకవర్గాల్లో ఇద్దరు కార్యకర్తల కుటుంబ సభ్యులను భువనేశ్వరి పరామర్శించారు. మృతి చెందిన కార్యకర్తల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తనను చూసి భావోద్వేగానికి గురైన కుటుంబ సభ్యులను ఓదార్చి పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. పాణ్యం నియోజకవర్గం, కల్లూరు టౌన్, 37వ వార్డులో గత ఏడాది సెప్టెంబర్ 26న మృతిచెందిన బోయ నరసింహులు (63), నందికొట్కూరు నియోజక వర్గం, మిద్తూరు మండలం, నాగులూతి గ్రామంలో గత ఏడాది సెప్టెంబర్ 10న మృతి చెందిన దూదేకుల చిన్న మాసూమ్ (69) కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించారు.












# భువనమ్మ సేవలు మాటల్లో చెప్పలేనివి

## - టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ



నంద్యాల (చైతన్యరథం): రాష్ట్రవ్యాప్తంగా 8,300 కిలోమీటర్ల సుదీర్ఘ ప్రయాణం, 91 అసెంబ్లీ నియోజకవర్గాల్లో విస్తృతమైన పర్యటన చేస్తూ కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలుస్తున్న భువనమ్మ గురించి చెప్పడానికి రోజులు సరిపోవని టీడీపీ ఎమ్మెల్సీ, పంచుమర్తి అనురాధ అన్నారు. నంద్యాలలోని ఎస్ఎన్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ముస్లిం మహిళలతో భువనేశ్వరి మాటామంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనురాధ మాట్లాడుతూ చంద్రబాబు అక్రమ అరెస్టు సమయంలో చనిపోయిన పార్టీ కార్యకర్తల కుటుంబాలను అన్ని విధాలా అదుకునేందుకు భువనమ్మ అనేక చర్యలు తీసుకుంటున్నారు. ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా 27రకాల సేవలు అందిస్తూ పేదవారికి అండగా నిలుస్తున్నారు. కరోనా కష్టసమయంలో రాష్ట్ర ప్రజల కోసం ఆక్సిజన్ సరఫరాలో ఎన్టీఆర్ ట్రస్టు కీలకపాత్ర పోషించింది. కరోనా కష్టసమయంలో తన భర్త, కుమారుడు ప్రజల చెంతకు వచ్చి అండగా నిలబడడంలో భువనమ్మ ప్రోత్సాహం మాటల్లో వర్ణించలేనిది. వైసీపీ అరాచక పాలనలో నారా లోకేష్ పాదయాత్ర చేస్తానని నిర్ణయించుకున్నప్పుడు తల్లిగా భువనమ్మ చాలా ఆందోళన చెందారు. అయినా రాష్ట్ర ప్రజల కోసం కుమారుడిని ఆశీర్వదించి మన మధ్యకు పంపారు. ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి పరిపాలన చేతకాక తన వైఫల్యాలను చంద్రబాబుపై నెట్టేస్తున్నాడు. గత ఎన్నికలకు ముందు పక్కా ప్రణాళికతో కోడికత్తి డ్రామాను రక్తి కట్టించిన జగన్మోహన్ రెడ్డి అక్కడితో ఆగకుండా కడప ఎంపీ సీటు కోసం సొంత బాబాయ్ నే పొట్టన పెట్టుకుని....మా బాబాయ్ ని చంపేశారు బాబోయ్ అని ఏడ్చి గోల చేశాడు...రాష్ట్ర ప్రజలను నమ్మించాడు. చిత్తూరు జిల్లాలో మైనారిటీ బాలిక మిస్బాను వైసీపీ నేతలు హింసిస్తే...ఆత్మహత్య చేసుకునేలా చేస్తే కనీసం వైసీపీ ప్రభుత్వం, జగన్మోహన్ రెడ్డి ఆ కుటుంబానికి న్యాయం చేయలేదు. నంద్యాలలో అబ్దుల్ సలాం కుటుంబాన్ని కక్షకట్టి వేధించి, కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకునేలా చేసిన దుర్మార్గులు వైసీపీ నాయకులు. పవిత్ర రంజాన్ మాసం సమయంలోనే ముస్లిములను వేధించిన దుర్మార్గుడు జగన్మోహన్ రెడ్డి. వైసీపీ 5ఏళ్ల పాలనలో మైనారిటీలకు ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా అమలు చేయలేదు...పైపెచ్చు చంద్రబాబు అమలు చేసిన పథకాలను రద్దు చేశాడు. మైనారిటీలపై జరిగిన దాడులు, వేధింపులకు జగన్మోహన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నాను. కులాలు, మతాలతో సంబంధం లేకుండా అన్ని వర్గాలను సమానంగా అక్కున చేర్చుకునే మనస్తత్వం చంద్రబాబుది. రోజుకు 5సార్లు నమాజ్ చేసుకునే ముస్లింలు తప్పు చేయరు...కానీ అలాంటి ముస్లిం సోదరులను వైసీపీ నేతలు వేధించి చంపుతున్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి మైనారిటీలు తగిన బుద్ధి చెప్పాలని అనురాధ పిలుపు ఇచ్చారు.

### మహిళలకు ఆదర్శప్రాయులు భువనేశ్వరి: బైరెడ్డి శబరి



కార్యక్రమంలో నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి మాట్లాడుతూ నారా భువనేశ్వరి మహిళలకు ఆదర్శప్రాయులన్నారు. ఎన్నికలు వస్తున్నాయి కాబట్టి వైసీపీ నేతలు మైనారిటీల గురించి మాట్లాడుతున్నారు. భారతదేశం మైనారిటీలకు ప్రత్యేక చట్టాలు, స్వేచ్ఛను ఇచ్చింది. ఏ దేశంలోనూ రద్దు చేయని ట్రిపుల్ తలాఖ్ ను భారతదేశం రద్దు చేసి ముస్లిం మహిళలకు అండగా నిలబడింది. వైసీపీ పాలనలో మైనారిటీ మహిళలకు ఏ న్యాయమూ చేయలేదు. వైసీపీ నేతలు మైనారిటీలు మా ఆత్మబంధువులు అని ప్రసంగాలు చెబుతున్నారు...హాస్యాస్పదం. మైనారిటీలకు న్యాయం చేసిన పార్టీ ఒక్క తెలుగుదేశం పార్టీనే. మైనారిటీలకు జగన్మోహన్ రెడ్డి సబ్‌ప్లాన్ ఇవ్వలేదు. మైనారిటీలకు రాజకీయాల్లో రిజర్వేషన్ ను తగ్గించి మోసం చేశారు. నామినేటెడ్ పోస్టులను కూడా తగ్గించారు. ఏపీలోని ఉర్దూ యూనివర్శిటీలన్నీ చంద్రబాబు తెచ్చినవే...చంద్రబాబు పాలనలో శంకుస్థాపన చేసిన ఉర్దూ యూనివర్శిటీలను వైసీపీ ప్రభుత్వం పూర్తిచేయకుండా ప్రక్కన పెట్టింది. ఉర్దూను రెండో అధికార భాషగా చేసిన వ్యక్తి చంద్రబాబు. వైసీపీ పాలనలో ముస్లిములకు ఎంత మందికి విదేశీవిద్యను అందించారో చెప్పాలి. చంద్రబాబు పాలనలో వక్ఫ్ బోర్డు భూములు చెక్కు చెదరలేదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వక్ఫ్ బోర్డు ఆస్తులను ఇష్టారీతిన కబ్జా చేసి దోచుకున్నారు. దర్గాలకు సంబంధించిన భూములను రీసర్వే చేయించి, డిజిటలైజ్ చేస్తామని చెప్పి మాటతప్పారు. మైనారిటీలకు స్థలాలు ఇచ్చి, ఇళ్ళు కట్టిస్తామని చెప్పి, ఆ హామీని విస్మరించారు. సీఏఏ పై అవగాహన లేని వైసీపీ నాయకులు ఇష్టారీతిన మాట్లాడుతున్నారు. మైనారిటీలను తప్పుదోవ పట్టించి ఆందోళనకు గురయ్యేలా చేస్తున్నారు. ముస్లిం మైనారిటీల తరపున నిలబడేది, వారిని అభివృద్ధి బాటలో ముందుకు నడిపేది కేవలం చంద్రబాబు ఒక్కరే. ముస్లిం మైనారిటీలంతా తమకోసం నిలబడే చంద్రబాబును ఆశీర్వదించాలని శబరి కోరారు.

### ముస్లింలకు మంచి జరిగింది చంద్రబాబు పాలనలోనే: రాజశేఖర్ గౌడ్



కార్యక్రమంలో నంద్యాల పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాతోపాటు, యావత్ ఏపీలో ముస్లిములకు మంచి జరిగిందంటే కేవలం చంద్రబాబు పాలనలోనే అన్నారు. జగన్ సీఎం అయ్యాక ముస్లింలు వేధింపులకు గురై ఆత్మహత్యలు చేసుకుంటే, హత్యలకు గురైతే కనీసం పట్టించుకున్న వారు లేరు. తాజాగా నందికొట్కూరులో ఓ ముస్లిం మహిళను వైసీపీ నాయకులు ఎలా ఇబ్బందిపెట్టారో మనం చూశాం. ఎమ్మిగనూరులో ఓ ముస్లిం మహిళపై అఘాయిత్యానికి పాల్పడి మూడేళ్లు గడిచినా కనీసం ఆ కేసును పట్టించుకున్న వైసీపీ నాయకుడు లేడు. ముస్లింలకు రంజాన్ తోఫా, పెళ్లిళ్లకు దుల్హన్ పథకాలు ఇచ్చిన వ్యక్తి చంద్రబాబు అయితే...జగన్మోహన్ రెడ్డి ఈ పథకాలన్నీ రద్దు చేశాడు. పేదరికంలో ఉన్న ముస్లింలకు వివిధ సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత తెలుగుదేశంపార్టీది, చంద్రబాబుది. చంద్రబాబు అక్రమంగా అరెస్టు అయిన సమయంలో నంద్యాలతో పాటు, ఏపీ వ్యాప్తంగా ఉన్న ముస్లిములంతా అండగా నిలిచారు..ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రామన్న ఎన్నికల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను ఆశీర్వదించాలని, సీట్లు అన్నిటిని గెలిపించాలని రాజశేఖర్ గౌడ్ కోరారు.

# మాజీ సైనికుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్

- దేశం కోసం పనిచేసిన వారిని అన్ని విధాలా ఆదుకుంటాం
- ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్ ప్రతినిధులతో నారా లోకేష్

ఉండవల్లి(చైతన్యరథం): దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించిన మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేసి, అన్ని విధాలా ఆదుకుంటామని నారా లోకేష్ పేర్కొన్నారు. ఉండవల్లిలోని నివాసంలో ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్ ప్రతినిధులతో యువనేత ముఖాముఖి నిర్వహించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... యువగళం పాదయాత్రలో మాజీ సైనిక ఉద్యోగులు పడుతున్న కష్టాలు స్వయంగా గమనించా. నేను ఢిల్లీకి వెళ్లినప్పుడు సెక్యూరిటీ విభాగంలో మన రాష్ట్రానికి చెందినవారే ఎక్కువగా ఉన్నారు. దేశరక్షణ కోసం అహర్నిశలు కృషిచేసిన మాజీ సైనికులను అన్నివిధాలా ఆదుకుంటాం. మాజీ సైనిక ఉద్యోగులు క్రమశిక్షణ, పట్టుదలకు నిదర్శనం. మంగళగిరి అభివృద్ధిలో ఎక్స్ సర్వీస్‌మెన్ కీలక బాధ్యతలు వహించాలని లోకేష్ కోరారు.

### పన్నుల భారం తగ్గించి వ్యాపారులకు అండగా ఉంటాం

జగన్ పాలనలో పన్నుల భారంతో వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెంచిన పన్నులను తగ్గిస్తామని లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి మండల పరిషత్ కాంప్లెక్స్ లీజు దారులు యువనేతను కలిసి తమ సమస్యలను విన్నవించారు. కాంప్లెక్స్ లో 40 ఏళ్లుగా దుకాణాలు నిర్వహిస్తున్నామని, తమ లీజును కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. 58 షాపుల్లో 24 షాపులు మాత్రమే కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయన్నారు. తమపై పన్నుల భారం తగ్గించాలని కోరారు. కాంప్లెక్స్ లీజుదారులు భయపడాల్సిన పనిలేదని, వారికి అన్ని విధాల అండగా ఉంటామని లోకేష్ హామీ ఇచ్చారు.










### యువనేత దృష్టికి మాజీ సైనికుల సమస్యలు

మాజీ సైనిక ఉద్యోగులు తమ సమస్యలను లోకేష్ దృష్టికి వస్తూ... మాజీ సైనిక కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయా లని కోరారు. మాజీ సైనిక ఉద్యోగులకు హక్కుగా ఇవ్వాల్సిన 175 గజాల ఇంటి స్థలం కేటాయింపు అమలుకావడం లేదన్నారు. ఇళ్ల స్థలాలు కేటాయిం చడంతో పాటు నియోజకవర్గ స్థాయిలో సైనిక కాలనీలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మంగళగిరిలో మాజీ సైనిక ఉద్యోగులకు కమ్యూనిటీ భవనం నిర్మించి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మాజీ సైనికులకు ఇచ్చే భూమి విషయం లో మూడేళ్ల నిబంధన సడలించాలని, ఎప్పుడైనా దరఖాస్తు చేసుకునే వెసులు బాటు కల్పించాలన్నారు. చనిపోయిన మాజీ సైనికుల కుటుంబానికి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఉద్యోగాల్లో వయస్సు పరిమితిని పెంచాలని కోరారు. పొరుగు రాష్ట్రంలో అమలవుతున్న కార్యక్రమాలను అధ్యయనం చేసి మాజీ సైనికులను ఆదుకుంటామని లోకేష్ భరోసా ఇచ్చారు.



# లోకేష్ సమక్షంలో 100 కుటుంబాలు టీడీపీలో చేరిక

ఉండవల్లి(చైతన్యరథం): ఆదర్శ మంగళగిరి కోసం అందరూ కలసిరావాలన్న యువనేత లోకేష్ పిలుపునకు నియోజకవర్గం నలుమూలల నుంచి మంచి స్పందన లభిస్తోంది. వివిధ పార్టీల నుంచి తెలుగుదేశం పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. తాడేపల్లి రూరల్ పెనుమాక గ్రామానికి చెందిన 40 కుటుంబాలు, మంగళగిరి మండలం ఆత్మకూరుకు చెందిన 60 కుటుంబాలు శనివారం టీడీపీలో చేరాయి. పార్టీలోకి నూతనంగా చేరిన వారికి ఉండవల్లి నివాసంలో యువనేత లోకేష్ పసుపుకండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. మంగళగిరి సమగ్రాభివృద్ధి కోసం కలిసివచ్చే ప్రతిఒక్కరికీ ఆహ్వానం పలుకుతున్నట్లు చెప్పారు. రాబోయే ఎన్నికల్లో విజయం సాధించాక అందరికీ తగిన ప్రాధాన్యతనిచ్చి గౌరవిస్తామని లోకేష్ తెలిపారు. తాడేపల్లి రూరల్ మండలం పెనుమాక గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు మండలనేని లక్ష్మీనారాయణ(ఎంఎల్ఆర్), నెమలకంటి సాంబశివరావు, వలపర్ల ప్రసాద్, మాలావత్ రవినాయక్, తాడిబోయిన సురేష్ యాదవ్ ఆధ్వర్యంలో 40 కుటుంబాలు, మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన తమ్మిశెట్టి రమణయ్య, సంపూర్ణమ్మ, బత్తుల సంజీవయ్య, తమ్మిశెట్టి నాగేశ్వరరావు, దేవళ్ల పెద వెంకయ్య ఆధ్వర్యంలో 60 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్యనేతలు పాల్గొన్నారు.



















# గతంలో ఇచ్చిన హామీలపై ఆర్కేని నిలదీయండి!

- మంగళగిరి సొంతమనుకుని సేవచేస్తున్నా...ఆశీర్వదించండి
- భూసేకరణ చేసి శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయిస్తాం
- నియోజకవర్గ రచ్చబండ సభల్లో నారా లోకేష్

మంగళగిరి/దుగ్గిరాల (చైతన్యరథం): కరకట్ట కమలాసన్ గా పేరొందిన మంగళగిరి ఎమ్మెల్యే ఆర్కే.. నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి నిధులు ఇవ్వలేదని, ఇళ్లపట్టాలు ఇవ్వలేదని ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తున్నానని రెండునెలల క్రితం చెప్పాడు.. మళ్లీ ఇప్పుడు వచ్చి నాటకాలు ఆడుతున్నాడు.. మీ వద్దకు వచ్చినపుడు గతంలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రజలంతా నిలదీయాలని యువనేత నారా లోకేష్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళగిరి నియోజకవర్గం రేవేంద్రపాడు, నూతక్కి, కుంచనపల్లిలో జరిగిన శనివారం జరిగిన రచ్చబండ సభల్లో లోకేష్ మాట్లాడుతూ... గత ఎన్నికల్లో ఓడిపోయిన రోజునుంచే మంగళగిరి నా సొంతమనుకుని సేవలందిస్తున్నా. అయిదేళ్లుగా సొంతనిధులతో 29సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాను. 4ట్యాంకర్లు పెట్టి తాగునీరు అందించాను, వర్షంపడి రోడ్లుపాడైతే సొంతడబ్బుతో గ్రావెల్ వేశాను. అధికారంలో లేకపోయినా యుద్ధ ప్రాతిపదికన సమస్యలు పరిష్కరించాను. మంగళగిరి నియోజకవర్గ ప్రజలు గుండెలమీద చేయివేసుకుని ఆలోచించండి. 25ఏళ్లుగా ఇక్కడ శాసనసభ్యులుగా ఎన్నికైన వారు నేను చేసిన పనుల్లో పదోవంతు అయినా చేశారా? గత ప్రభుత్వ హయాంలో రేవేంద్రపాడు బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయిస్తే, వైసీపీ అధికారంలోకి వచ్చాక నిలిపివేశారు. అయిదేళ్లుగా కనీసం మరమ్మతులు కూడా చేయలేదు. ఈ బ్రిడ్జి శిథిలావస్థకు చేరడం వల్ల చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు కూడా ఇబ్బందిగా ఉంది. 2నెలల్లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక రేవేంద్రపాడు బ్రిడ్జి నిర్మిస్తా. జగన్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి గుంతల రోడ్ల పథకాన్ని ప్రవేశపెట్టారు. గత ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే ఆర్కే ఏం చెప్పారు? ఇళ్లు లేని వారందరికీ ఇళ్లపట్టాలు ఇప్పిస్తానని చెప్పి ఒక్కరికైనా పట్టా ఇచ్చారా? నియోజకవర్గంలో డ్రైనేజి సమస్య తీవ్రంగా ఉంది. అధికారంలోకి వచ్చాక అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులు చేపడతాం. పక్కనే కృష్ణానది ఉన్నా ఇక్కడి ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడటం విచారకరం. కృష్ణానది నుంచి పైప్ లైన్ వేసి ఇంటింటికీ కుళాయి



అందించే బాధ్యత నాది. జగన్ అధికారంలోకి వచ్చాక కరెంటు ఛార్జీలు, ఆర్టీసీ ఛార్జీలు, ఇంటిపన్ను, చెత్తపన్ను అంటూ రకరకాలుగా ప్రజలపై భారాలు మోపారు. యువగళం పేరుతో కుప్పం నుంచి రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేసి ప్రజల సమస్యలు తెలుసుకున్నాను. వాటన్నింటినీ పరిశీలించాక చంద్రబాబు, పవనన్న సూపర్-6 హామీలను ప్రకటించారు. లక్షలు ఖర్చుపెట్టి చదివించిన బిడ్డలకు ఉద్యోగాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనే మా ప్రథమ ప్రాధాన్యత. పరిశ్రమలు రప్పించి అయిదేళ్లలో 20లక్షల ఉద్యోగాలిస్తాం. సంక్షేమం, అభివృద్ధి సైకిల్‌కు రెండు చక్రాలు. పనిచేయడానికి మంగళగిరి నియోజకవర్గానికి వచ్చా. దేశంలోనే మంగళగిరిని అభివృద్ధికి చిరునామాగా మారుస్తా. మీ ఇంటిబిడ్డలా భావించి రాబోయే ఎన్నికల్లో నన్ను ఆశీర్వదించండి, అత్యధిక మెజారిటీతో గెలిపించి సేవచేసే అవకాశం కల్పించాలని లోకేష్ కోరారు.













## లోకేష్ దృష్టికి రేవేంద్రపాడు, నూతక్కి గ్రామాల సమస్యలు







దుగ్గిరాల మండలం రేవేంద్రపాడులో నిర్వహించిన రచ్చబండ సభలో గ్రామస్తులు తమ సమస్యలను లోకేష్ దృష్టికి తెచ్చారు. గ్రామంలో సిమెంటు రోడ్లు, డ్రైనేజి, తాగునీటి సౌకర్యం కల్పించాలి. ఇళ్లులేని వారికి ఇంటిపట్టాలు ఇప్పించాలి. ఆరోగ్యశ్రీ పథకం కింద ఆసుపత్రుల్లో వైద్యం అందించడం లేదు. కరెంటు బిల్లు ఎక్కువ వచ్చిందనే సాకుతో పింఛన్‌ను నిలిపివేస్తున్నారు. రోడ్డువిస్తరణలో మసీదు పోయేలా ఉంది. ముస్లింలకు మసీదు, కమ్యూనిటీ హాలు, ఖబరస్థాన్ ఏర్పాటుచేయాలి. రూ. 80 లక్షలు మంజూరయ్యాయని చెప్పిన ఎమ్మెల్యే ఆర్కే 80 రూపాయలు కూడా ఇవ్వలేదు. దళితులకు శ్మశానవాటిక లేదు. రేవేంద్రపాడు పొలిమేరల్లో పొలాలకు వెళ్లే పుంతరోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. నూతక్కి ప్రజలు తమ సమస్యలు చెబుతూ మురుగునీరు పంటకాల్వల్లోకి వస్తుంది, డ్రైన్ల నిర్మాణం చేపట్టాలి. లంకభూములకు పట్టాలివ్వాలి. వరదల బారినుంచి కాపాడాలి. ఇంటర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటుచేయాలి. ఇసుక కొరత వల్ల పనుల్లేక ఇబ్బందులు పడుతున్నాం. కుంటిసాకులతో పింఛన్లలో కోతలు విధిస్తున్నారని చెప్పారు. లోకేష్ స్పందిస్తూ... ఇళ్లులేనివారికి ఇళ్లపట్టాలతోపాటు ఇళ్లు నిర్మించి ఇస్తాం. సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజి, తాగునీటి సౌకర్యం కల్పిస్తాం. పంటకాల్వలకు లాకులు ఏర్పాటు చేస్తాం. శ్మశానవాటికల సమస్య రాష్ట్రవ్యాప్తంగా ఉంది. భూసేకరణ చేసి జనాభా దామాషా ప్రాతిపదికన శ్మశానాలకు స్థలాలను కేటాయిస్తాం. అధికారంలోకి వచ్చాక ముస్లింలకు మసీదు, కమ్యూనిటీ హాలు నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. మైనారిటీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి బలోపేతం చేస్తామని లోకేష్ హామీ ఇచ్చారు.

## టూకీగా

### వైసీపీకి ఎమ్మెల్యే ఎంఎస్ బాబు గుడ్‌బై - కాంగ్రెస్‌లో చేరిక

కడప: ఏపీ అధికారపక్షం వైసీపీలో మరో వికెట్ పడింది! తాజాగా, పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు వైసీపీకి గుడ్ బై చెప్పారు. ఎంఎస్ బాబు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల సమక్షంలో ఎంఎస్ బాబు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కడపలో జరిగిన ఓ కార్యక్రమంలో ఎంఎస్ బాబుకు కాంగ్రెస్ కండువా కప్పిన షర్మిల ఆయనను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఇటీవల కాలంలో సిట్టింగ్ ఎమ్మెల్యేలు, సిట్టింగ్ ఎంపీలు వైసీపీని వదిలి వెళ్లిపోతుండడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. చాలామంది సిట్టింగ్ లకు ఈసారి ఎన్నికల్లో వైసీపీ అధినాయకత్వం టికెట్ నిరాకరించడమే ఈ వలసలకు కారణమని తెలుస్తోంది.

### వైసీపీకి మాజీ ఎమ్మెల్యే రాజీనామా

అనంతపురం: అనంతపురం జిల్లాలో వైసీపీకి షాక్ తగిలింది. వైసీపీకి మాజీ ఎమ్మెల్యే యామిని బాల రాజీనామా చేశారు. యామినీ బాల శింగనమల నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేయాలని భావించారు. అయితే అక్కడ నుంచి వేరే అభ్యర్థిని వైసీపీ నిలబెట్టటంతో యామినీ బాల అసంతృప్తి చెందారు. కొద్ది రోజులుగా పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉన్న ఆమె శనివారం రాజీనామా చేశారు.

### జగన్ శిబిరం వద్ద అవమానం

#### అలిగి వెళ్లిపోయిన జడ్పీ చైర్‌పర్సన్

నెల్లూరు: జగన్ సభ వద్ద నెల్లూరు జడ్పీ చైర్ పర్సన్ దంపతులకు అవమానం జరిగింది. చింతారెడ్డిపాలెంలో జగన్ బస చేసిన శిబిరంలోకి వెళ్లేందుకు జడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, ఆమె భర్త విజయకుమార్ రెడ్డి ప్రయత్నించగా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. ప్రోటోకాల్ ప్రకారం తమకే తొలి అనుమతి ఉంటుందని ఆనం అరుణమ్మ చెప్పగా, జాబితాలో పేర్లు లేవంటూ సీఎం సెక్యూరిటీ సిబ్బంది గట్టిగా సమాధానం చెప్పారు. దీంతో అవమానంగా భావించిన అరుణమ్మ దంపతులు జగన్ కోసం తెచ్చిన బొకేను విసిరేసి అలిగి వెళ్లిపోయారు.

### రాజకీయ పార్టీలతో అంటకాగే అధికారులు బాధపడే రోజులొస్తాయి: ఎల్వీ

విజయవాడ: నిష్పక్షపాత వైఖరి కోల్పోయి.. ఒక రాజకీయ పార్టీకి అండగా పనిచేస్తున్న అధికారులు చింతించే రోజు తప్పకుండా వస్తుందని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ (సీఎఫ్‌డీ) సంస్థ ఉపాధ్యక్షుడు, ఏపీ మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని గౌరవించి, ఆదరించి, ఆచరించి, పోటీ చేసిన అభ్యర్థులందరికీ నమ్మకాన్ని కలిగించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగానిదేనని సీఎఫ్‌డీ ప్రతినిధులు పేర్కొన్నారు. తాము ఏ రాజకీయ పార్టీ సభ్యత్వం తీసుకున్న వాళ్లం కాదంటూ విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు ఘాటుగా స్పందించారు. జిల్లా కలెక్టరు నుంచి సీఎస్ వరకు, ఎస్పీ నుంచి డీజీపీ వరకు నిష్పక్షపాత వైఖరి చూపించాలని పిలుపునిచ్చారు. ఈసీ ఆదేశాలు విఫలమయ్యేలా చేయడంలో కీలకంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### నిధులున్నప్పటికీ ఆలస్యం: నిమ్మగడ్డ

పింఛన్ల పంపిణీలో ఆలస్యానికి కారకులపై చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి సీఎఫ్‌డీ ఫిర్యాదు చేసింది. 62 లక్షల మందిని కొందరు అధికారులు ఇబ్బంది పెడుతున్నారని సంస్థ కార్యదర్శి నిమ్మగడ్డ రమేశ్ అన్నారు. కొందరు కావాలనే పింఛన్ల పంపిణీని ఆలస్యం చేశారని ఆరోపించారు. నిధులు ఉన్నప్పటికీ జాప్యం చేశారని, మే నెలలో ఒకటో తేదీనే పెన్షన్లు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని సీఈవోను కోరారు.

# చంద్రబాబుపై జగన్‌రెడ్డి వ్యక్తిగత దూషణలు

## - చర్యలు తీసుకోవాలని సీఈఓకు టీడీపీ నేతల ఫిర్యాదు





- ప్రభుత్వ గెస్ట్‌హౌస్‌లో మంత్రి బొత్స, ఆయన సతీమణి సమావేశాలు
- పింఛన్లపై జగన్‌రెడ్డి దుష్ప్రచారం
- సచివాలయ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు వెంకటరామిరెడ్డిపై చర్యలేవీ?
- కేసుల వివరాలు ఇచ్చేలా డీజీపీని ఆదేశించాలి

అమరావతి(చైతన్యరథం): ముఖ్యమంత్రి హోదాలో ఉండి టీడీపీ అధినేత చంద్రబాబును, టీడీపీని అసభ్యకరంగా, వ్యక్తిగతంగా దూషిస్తున్న జగన్‌మోహన్ రెడ్డిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పార్టీ సీనియర్ నేతలు వర్ల రామయ్య, దేవినేని ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ముఖేష్ కుమార్ మీనాను శనివారం కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో చంద్రబాబును ఉద్దేశించి జగన్‌రెడ్డి చేసిన విమర్శలపై టీడీపీ నేతలు మండిపడ్డారు.

**ఎన్నికల కోడ్‌కు జగన్‌రెడ్డి అతీతుడా: వర్ల రామయ్య**

రాజకీయాల్లో జగన్ రెడ్డి పెద్ద నటుడని, తన నటనతో ప్రజలను మభ్య పెట్టడానికి ప్రయత్నిస్తూ ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నాడని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య విమర్శించారు. బాబాయిని చంపిన రోజు నుంచి జగన్ రెడ్డి నటనను చూస్తున్నాం. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి జగన్ రెడ్డి అతీతుడు కాదు. సీఈఓ వెంటనే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి జగన్ రెడ్డిపై కేసు నమోదు చేసి చంద్రబాబుపై అసభ్య పదజాలం ఉపయోగించినందుకు చట్టరీత్య చర్యలు తీసుకోవాలని వర్ల డిమాండ్ చేశారు.

**ప్రభుత్వ గెస్ట్‌హౌస్‌ను బొత్స ఎలా వాడతారు?**

ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత ఏ అభ్యర్థి కూడా ప్రభుత్వ భవనాలను ఉపయోగించడానికి వీలు లేదు. కానీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా పోటీలో ఉన్న మంత్రి బొత్స సత్యనారాయణ, అతని సతీమణి ఝాన్సీ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా విశాఖలో ప్రభుత్వ గెస్ట్‌హౌస్‌లో సమావేశాలు నిర్వహిస్తున్నారు. అన్ని రుజువులతో సహా జత చేసి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశాం. ప్రభుత్వ గెస్ట్‌హౌస్‌ను ఎన్నికల ప్రచారానికి ఉపయోగించినందుకు బొత్సపైనా, ఆయన భార్యపైనా చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని కోరినట్లు వర్ల తెలిపారు.

**కేసుల వివరాలు ఇవ్వాలి**

మా పార్టీ అభ్యర్థులపై రాష్ట్రంలో ఎక్కడెక్కడ ఏమేమి కేసులున్నాయో ఈ నెల 10 తేదీ లోపు తెలియజేయాలని డీజీపీని అనేక విధాలుగా కోరాం. రాష్ట్రంలో ఉన్న 26 జిల్లాల్లో చంద్రబాబుపై ఏమేమి కేసులు ఉన్నాయో తెలపాలని 10 రోజుల క్రితమే అభ్యర్థిస్తే 13 జిల్లాల నుండి మాత్రమే మాకు సమాచారం వచ్చింది. మరో 13 జిల్లాల నుండి వివరాలు ఇంకా అందలేదు. ఒక మాజీ ముఖ్యమంత్రిపై ఉన్న కేసులు వివరాలు తెలపడానికే ఇన్ని రోజులు పడితే ఇక మిగిలిన అభ్యర్థుల పరిస్థితి ఏంటి? ఈ విషయాన్ని కీలకమైనదిగా పరిగణలోకి తీసుకొని వెంటనే మా అభ్యర్థులపై ఉన్న కేసుల వివరాలు పోలీసు శాఖ నుంచి వచ్చే విధంగా డీజీపీకి ఆదేశాలివ్వాలని సీఈవోను కోరామని వర్ల చెప్పారు.

**పింఛన్లపై దుష్ప్రచారం**

పింఛన్ల విషయంలో జగన్ రెడ్డి దుష్ప్రచారం చేస్తున్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లపై అవమానకరంగా పోస్టులు పెట్టిస్తున్నారు. ఇది ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధం. దీనికి సంబంధించి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్ రెడ్డిపై క్రిమినల్ కేసు పెట్టి చర్యలు తీసుకోవాలని కూడా సీఈవోను కోరామని వర్ల తెలిపారు.

**వెంకటరామిరెడ్డిని సస్పెండ్ చేయాలి**

సచివాలయ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు వెంకటరామిరెడ్డిపై ఇప్పటికే ఎన్నో ఫిర్యాదులు చేశాం. ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి ఎన్నికల ప్రచారం చేయడం నేరం. బద్వేల్‌లో ఆయనతో పాటు వైకాపా తరపున ఎన్నికల ప్రచారం చేసిన ఆర్టీసీ ఉద్యోగులను సస్పెండ్ చేశారు. మరి వారితో పాటు ప్రచారం చేసిన సెక్రటేరియట్ ఉద్యోగి వెంకటరామిరెడ్డిని ఎందుకు సస్పెండ్ చేయలేదు. ప్రభుత్వ ఖజానా నుండి జీతం తీసుకుంటూ అధికార పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్న వెంకటరామిరెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని సీఈఓను కోరినట్లు వర్ల చెప్పారు.

**దొడ్డిదారులు వద్దు**

చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా ప్రజాక్షేత్రంలో పోరాటం చేద్దాం. ప్రజలు వైసీపీని గెలిపిస్తారా..లేక టీడీపీని గెలిపిస్తారో చూద్దాం. అంతేకానీ దొడ్డిదారుల్లో పోలీసులను అడ్డుపెట్టుకొని గెలవాలని చూడవద్దని జగన్‌రెడ్డిని వర్ల రామయ్య హెచ్చరించారు.

**ఓటమి భయంతోనే కారుకూతలు: దేవినేని ఉమా**

జగన్ రెడ్డి కళ్ళలో ఓటమి భయం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని, ఓటమి భయంతోనే పిచ్చెక్కినట్లు మాట్లాడుతున్నాడని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శించారు. ఓటమి భయంతో జగన్ రెడ్డి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు. జగన్ రెడ్డి ఎన్ని సినిమా యాక్టింగ్‌లు చేసినా ఓటమి భయం మాత్రం అతని కళ్ళల్లో కనబడుతోంది. సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి కారణంగా ఆర్టీసీ ఉద్యోగులు సస్పెండ్ అయ్యారు. సర్వీస్ రూల్స్‌కు వ్యతిరేకంగా ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో వెంకటరామిరెడ్డి పాల్గొంటున్నాడని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్ళాం. ఎన్నికల కమిషన్ నిబంధనలకు ఎవరూ అతీతులు కారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఎంతటి వారిపైనైనా చర్యలు తీసుకోవాలని సీఈవోను కోరామని ఉమా తెలిపారు.

# హంతకులు అధికారంలో ఉంటే ఎప్పటికీ న్యాయం జరగదు

## - అవినాష్ ఓటమే నా లక్ష్యం: సునీత

హైదరాబాద్: వైఎస్ వివేకాను హత్య చేసిన వారు దర్జాగా బయట తిరుగుతుంటే.. వ్యవస్థలు ఏమీ చేయలేకపోతున్నాయని ఆయన కుమార్తె సునీత ఆవేదన వ్యక్తం చేశారు. హంతకులు అధికారంలో ఉంటే ఎప్పటికీ న్యాయం జరగదన్నారు. వైఎస్ వివేకా హత్యపై ఐదేళ్లుగా జరుగుతున్న పోరాటంలో ఎన్ని కష్టాలుంటాయో ఇప్పుడు అర్థమైందని చెప్పారు. తనకు చదువు, తెలివి, స్తోమత ఉన్నా ఏమీ చేయలేని నిస్సహాయ పరిస్థితి అని వివరించారు. అవినాష్ రెడ్డిని గెలవకుండా చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. హైదరాబాద్లో శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ తన పోరాటం రాజకీయం కోసం కాదని.. న్యాయం కోసమని స్పష్టం చేశారు.

2009కి ముందు వైఎస్ఆర్, వివేకాల్లో ఎవరో ఒకరు కడప ఎంపీగా పోటీ చేసేవారు. వైఎస్ఆర్ చనిపోయిన సమయంలో జగన్ ఎంపీగా ఉన్నారు. పులివెందులలో ఎవరు పోటీ చేయాలనే అంశంపై చర్చ జరిగింది. చర్చలో వైఎస్ భాస్కర్ రెడ్డి పేరు ముందుకు వచ్చింది. ఆయన పోటీ చేయడానికి వివేకా అంగీకరించలేదు. షర్మిల లేదా విజయమ్మ పోటీ చేయాలని వివేకా చెప్పారు. ఈ సమయంలో వివేకాకు మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ నిర్ణయించింది. అయితే.. దీనిని జగన్ వ్యతిరేకించారు. ఆ తర్వాత జగన్, విజయమ్మ కాంగ్రెసుకు రాజీనామా చేసి బయటకు వచ్చారు. 2011 ఉప ఎన్నికల్లో ఎంపీగా జగన్, ఎమ్మెల్యేగా విజయమ్మ పోటీ చేశారు. ఆ తర్వాత జగన్ తో ఉండాలని నిర్ణయించి వివేకా కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చారని సునీత చెప్పారు.



కొద్దిరోజులకే సీబీఐ కేసుల్లో జగన్ అరెస్టయి జైలులో ఉన్నారు. షర్మిల పార్టీని భుజాన వేసుకుని నడిపించింది. జగన్ వెంట వచ్చిన ఎంపీలు, ఎమ్మెల్యేల రాజీనామా తర్వాత వచ్చిన ఉప ఎన్నికల్లో షర్మిల ప్రచారం చేసి గెలిపించారు. ఉప ఎన్నికల్లో విజయం తర్వాత షర్మిలకు ఆదరణ వస్తోందని ఆమెను జగన్ పక్కనపెట్టారు. 2014 ఎన్నికల్లో కడప నుంచి ఆమె పోటీ చేస్తారని అందరూ భావించారు. అయితే.. ఆ స్థానాన్ని అవినాష్ రెడ్డికి ఇవ్వాలని జగన్ నిర్ణయించారు. ఇది వివేకాకు ఇష్టం లేదు. ఆ తర్వాత ఎమ్మెల్సీ ఎన్నికల్లో వివేకా ఓటమిపాలయ్యారు. అవినాష్ కుటుంబం వెన్నుపోటుతో ఆయన ఓటమిపాలైన విషయం స్పష్టమైంది. నా కుటుంబంలోని వారే వివేకాను హత్య చేశారని నేను మొదట నమ్మలేదు. వారిని సంపూర్ణంగా విశ్వసించడం నేను చేసిన పొరపాటని సునీత అన్నారు.

చైతన్యరథం

# చేతగానివారే కుల, మతాలను రెచ్చగొడతారు!

## - కుంచనపల్లి రచ్చబండలో యువనేత నారా లోకేష్



తాడేపల్లి (చైతన్యరథం): పనిచేయడం చేతగానివారే కుల, మతాలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తారని యువనేత నారా లోకేష్ మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కుంచనపల్లిలో నిర్వహించిన రచ్చబండ సభలో లోకేష్ మాట్లాడుతూ...జగన్‌రెడ్డి గెలిచే సీట్లు సొంత సామాజికవర్గం వారికి కేటాయించి, ఓడిపోయే సీట్లను ఇతర సామాజిక వర్గాల వారికి కేటాయించారన్నారు. తెలుగుదేశం పార్టీ బీసీలకు అత్యధిక సీట్లు కేటాయించింది. వైసీపీ కుటిల రాజకీయాలపై కాపు సోదరులు అప్రమత్తంగా ఉండాలి. 2014లో తండ్రి శవం, 2019లో బాబాయిని చంపి ఆ శవంతో జగన్ రెడ్డి సానుభూతి పొందారు. ఇప్పుడు పింఛన్ ఇవ్వకుండా వృద్ధులను చంపేసి శవరాజకీయం చేస్తున్నారు. నన్ను, గుంటూరు లోక్‌సభ అభ్యర్థి పెమ్మసానిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే డబుల్ ఇంజన్ లా పనిచేసి దేశంలోనే మంగళగిరిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని లోకేష్ పేర్కొన్నారు. ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజావేదిక కూల్చివేతతో జగన్ రెడ్డి విధ్వంస పాలన ప్రారంభమైందన్నారు. ఆనాడు కుల, మతాలకు అతీతంగా పారిశ్రామికవేత్త అయిన అయోధ్యరామిరెడ్డిని చంద్రబాబు ప్రోత్సహించారు. ఆయన కనీసం కృతజ్ఞత లేకుండా చంద్రబాబు కుమారుడు లోకేష్‌పై నీచ రాజకీయాలు చేస్తున్నారు. పదేళ్లుగా మంగళగిరి నియోజకవర్గానికి ఆర్కే చేసిందేమీ లేదు. గుంటూరు పార్లమెంట్ వైకాపా అభ్యర్థిగా కాపులను బలిచేస్తున్నారు. ఇష్టం లేకపోయినా బెదిరించి పోటీలో నిలిపారని అన్నారు.

### లోకేష్‌కు సమస్యలు చెప్పుకున్న కుంచనపల్లి వాసులు

కుంచనపల్లి వాసులు తమ సమస్యలను లోకేష్‌కు చెబుతూ కోతలు లేకుండా సంక్షేమ కార్యక్రమాలు అందించాలని కోరారు. కుంచనపల్లిని కార్పొరేషన్ నుంచి తప్పించి గ్రామ పంచాయతీగా మార్చాలి. ఇళ్లులేని వారికి ఇళ్లపట్టాలు ఇవ్వాలి. రోడ్లు, డ్రైనేజీ సౌకర్యం కల్పించాలి. హైస్కూల్, బస్సు సౌకర్యం కల్పించాలి. గంజాయికి అడ్డుకట్టవేయాలి, ఐటీని అభివృద్ధి చేయాలని కోరారు. లోకేష్ స్పందిస్తూ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంతో పాటు ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. గత టీడీపీ ప్రభుత్వం మాదిరిగానే కోతలు లేకుండా సంక్షేమం అందిస్తామన్నారు. కుంచనపల్లిని గ్రామ పంచాయితీగా మార్చే విషయంలో ప్రజాభిప్రాయం ద్వారా నిర్ణయం తీసుకుంటామని లోకేష్ చెప్పారు.







పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో అయుర్వేదిక్ వైద్యులు జమాల్ ఖాన్, చంద్రశేఖర్ రాజు శనివారం ఉదయం టీడీపీలో చేరారు. వీరికి చంద్రబాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండలి మాజీ చైర్మన్ ఎం.ఎ. షరీఫ్ పాల్గొన్నారు.



### మారుమోగిన మహిళా గళం!

అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో శనివారం నిర్వహించిన 'మేలుకో మహిళ' కార్యక్రమానికి వేలాది మంది మహిళలు హాజరయ్యారు. మహిళా లోకాన్ని చైతన్య పరచటానికి టీడీపీ నాయకుడు చింతకాయల విజయ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నర్సీపట్నం టీడీపీ అభ్యర్థి, మాజీ మంత్రి అయ్యన్న పాత్రుడు, అనకాపల్లి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి సీఎం రమేష్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ జగన్‌రెడ్డి రాక్షస పాలనలో మహిళలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. ఎన్టీఆర్ .. మహిళలకు ఆస్తిలో సమాన హక్కుతో పాటు రాజకీయ స్వాతంత్రం ఇచ్చారన్నారు. చంద్రబాబు డ్వాక్రా సంఘాలు పెట్టి, సాఫ్ట్ వేర్ రంగాన్ని తీసుకొచ్చి మహిళలకు ఆర్థిక స్వాతంత్రం ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమానికి 10 వేల మందికి పైగా మహిళలు తరలివచ్చారు.

# పద్ధతి మార్చుకోకుంటే..మీ కేరీర్‌కే నష్టం..!

- తప్పు చేస్తే ప్రజాక్షేత్రంలో నిలదీస్తాం
- ఇప్పటికీ తాడేపల్లి కొంపకు ఊడిగం చేస్తున్న అధికారులకు టీడీపీ హెచ్చరిక
- కొందరు ఐఏఎస్‌లు జగన్‌రెడ్డికి అయ్యాఎస్‌లుగా మారారు
- కొందరు ఐపిఎస్‌లు జగన్ పర్సనల్ సర్వీసెస్‌గా వ్యవహరిస్తున్నారు
- పింఛన్‌దారుల మృతికి కారణమైన సిఎస్‌పైన కేసు పెట్టాలన్న పట్టాభి

అమరావతి,చైతన్యరథం: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ కొందరు ఐఏఎస్, ఐపిఎస్ అధికారులు ఇప్పటికీ తాడేపల్లి కొంపకు ఊడిగం చేస్తున్నారని, వారు వెనువెంటనే పద్ధతి మార్చుకోవాలని, నిజాయితీతో వ్యవహరించాలని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ విజ్ఞప్తి చేశారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని, పద్ధతి మార్చుకోకుండా ఇంకా జగన్‌రెడ్డి సేవలో తరిస్తే ప్రజల్లో మరింత చులకనవుతారని, భవిష్యత్తులో వారి కేరీర్‌కు కూడా నష్టం కల్గుతుందని ఆయన హెచ్చరించారు. తప్పు చేసిన ఏ అధికారినైనా నిలదీసే హక్కు ప్రతిపక్షాలు ఉన్నాయని, అధికారులు చేస్తున్న చెడ్డ పనులను ఎత్తి చూపడం మీడియా బాధ్యతని, ఆ పని చేయడం తప్పు అన్నట్లు పోలీసు అధికారుల సంఘం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం సిగ్గుచేటు అని అన్నారు. తప్పు చేసిన అధికారులను ప్రజాక్షేత్రంలో నిలదీస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటికీ చాలా మంది ఐఏఎస్‌లు, ఐపిఎస్‌లు నిజాయితీగా విధులు నిర్వహిస్తున్నారని, కానీ కొంతమంది కళంకిత అధికారుల కారణంగా మొత్తం వ్యవస్థకే చెడ్డపేరు వస్తోందని, వీరి కారణంగా రాష్ట్రంలో ఎన్నికలు పారదర్శకంగా జరుగుతాయనే నమ్మకాన్ని ప్రజలు కోల్పోతున్నారని పట్టాభి ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టాభి మాట్లాడుతూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి కూడా పింఛన్ల పంపిణీలో తాడేపల్లి కొంప నుండి వచ్చిన ఆదేశాలను పాటించి కొంతమంది వృద్ధుల మృతికి కారణమయ్యారని, కేసు పెడితే ఆయన మీద కూడా పెట్టాలని అన్నారు.

### తప్పుడు ఎఫ్‌ఐఆర్‌లు పెట్టినట్లు తప్పుడు లేఖలు

నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాల్సిన ఐఎఎస్‌లు, ఐపిఎస్‌లు తాడేపల్లి కొంపకు ఊడిగం చేస్తుంటే తాము ప్రశ్నించకుండా ఉండాలా అని పట్టాభి అడిగారు. తప్పు చేసిన అధికారులను ప్రశ్నించవద్దని రాజ్యాంగంలో ఎక్కడైనా రాశారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కొందరు ఐఎఎస్‌లు సిఎం జగన్‌రెడ్డికి అయ్యాఎస్‌లుగా మారారని, కొంతమంది ఐపిఎస్‌లు జెపిఎస్‌గా అంటే జగన్ పర్సనల్ సర్వీసెస్‌గా మారారని అన్నారు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత కూడా వీరు వైసీపీ కార్యకర్తల్లా పని చేస్తుండడంతో తమ పార్టీ నేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారని, మీడియా కూడా తప్పు చేసిన అధికారుల తీరును ఎండగట్టిందని అన్నారు. అయితే ఇదేదో తప్పు అయినట్లుగా పోలీసు అధికారుల సంఘం తరఫున విజయవాడ పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా , మరో ఐపిఎస్ రవీంద్రనాథ్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారని చెప్పారు. తమపై ఎటువంటి ఆధారాలు లేకుండా ప్రతిపక్షం, మీడియా దుష్ప్రచారం చేస్తుందంటూ వీరు లేఖ ఇచ్చారని, సాక్షాత్తూ దేశ ప్రధాని పాల్గొన్న సభలోనే క్రౌడ్ మేనేజ్ మెంట్ చేయలేక పోలీసులు విఫలమయ్యింది నిజం కాదా అని ప్రశ్నించారు. ఇది తాడేపల్లి ప్యాలెస్ మెప్పు కోసం ఉద్దేశపూర్వకంగా చేసిన తప్పు కాదా అని అడిగారు. ప్రధాని మోదీ, మాజీ ముఖ్యమంత్రులు చంద్రబాబు, కిరణ్‌కుమార్‌రెడ్డి, మాజీ కేంద్ర మంత్రి పురంధేశ్వరీ పాల్గొన్న సభకు భద్రత కల్పించడంలో విఫలమవ్వలేదా అని ప్రశ్నించారు. నందిగామ ఎమ్మెల్యే, అతని సోదరుడు వారిని ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నించారని కొందర్ని ఇనుప రాడ్లతో తలలు పగలగొట్టారని, ప్రాణాలు తీసినంత పని చేశారని, కానీ పోలీసులు మాత్రం దాడి చేసిన వారికి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించారని, బాధితులపైనే తిరిగి కేసులు పెట్టారని, ఇది కాంతిరాణా టాటా కమిషనరేట్ పరిధిలోనే జరిగిందని తెలిపారు. కొందరు పోలీసులు వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారనడానికి ఇంతకన్నా పెద్ద సాక్ష్యం ఏం కావాలని ప్రశ్నించారు. గతంలో తాడేపల్లి కొంప ఆదేశాలతో ప్రతిపక్ష నేతలపైన తప్పుడు ఎఫ్ఐఆర్‌లు రాసినట్లు ఇప్పుడు ఎన్నికల సంఘానికి తప్పుడు లేఖ రాసారని మండిపడ్డారు. తమ ట్రాక్ రికార్డు చూడాలని కూడా లేఖలో పేర్కొన్నారని, కొందరు పోలీసుల తీరుకు బలైన వారిలో తానే పెద్ద ఉదాహరణ అని, తన ఇంటిపై దాడి చేసి పగుల కొట్టి, తనపైన దాడి చేస్తే నిందితులను వదిలేసి తిరిగి తననే జైల్లో వేశారని చెప్పారు. పోలీసుల తీరుతో బాధితులే నేరస్థులుగా మారిన పరిస్థితులు ఉన్నాయని అన్నారు.

### పింఛన్‌దారుల మృతికి సిఎస్‌దే బాధ్యత

పెన్షన్ల పంపిణీలో పెద్ద కుట్రకు తెరదీసి తాడేపల్లి కొంప నుండి వచ్చిన ఆదేశాల ప్రకారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి వ్యవహరించిన తీరు కారణంగానే మండుటెండలకు తాళలేక వృద్ధులు చనిపోయారని, ఇవి కచ్చితంగా ప్రభుత్వం చేసిన హత్యలేనని, దీనికి జవహర్‌రెడ్డి కూడా బాధ్యత వహించాలని పట్టాభి అన్నారు. ఈ ఘటనపై కేసు అంటూ పెడితే సీఎస్ పైనా కూడా పెట్టాలని అన్నారు. వాలంటీర్ల వ్యవస్థను పక్కన పెట్టాక ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి పింఛన్లు ఇవ్వాలని ఎన్నికల సంఘం ఆదేశించిందని, ఎక్కడా ఇంటింటికి వెళ్లి పెన్షన్ ఇవ్వొద్దని ఈసీ చెప్పలేదు కదా అని సీఎస్‌ను పట్టాభి ప్రశ్నించారు. కానీ సచివాలయాల వద్దకే వచ్చి పెన్షన్లు తీసుకోవాలని సీఎస్ ఉత్తర్వులు ఇచ్చారని, జగన్‌రెడ్డి రాజకీయ స్వార్థం కోసం చేసిన కుట్రలో సీఎస్ కూడా భాగస్వామి అయ్యాడని, ఆయన్ను పదవి నుండి తొలగించాలని పట్టాభి డిమాండ్ చేశారు.



# ఎన్నికలప్పుడే జగన్‌కి బ్రాహ్మణులు గుర్తొస్తారా?

- పూజారులు, అర్చకులపై దాడులు జరిగినపుడు ఎందుకు స్పందించలేదు?
- గత ఎన్నికల్లో బ్రాహ్మణులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా నెరవేర్చారా?
- నిలదీసిన టీడీపీ నేత బుచ్చి రాంప్రసాద్

అమరావతి (చైతన్యరథం): సీఎం జగన్ బ్రాహ్మణులను 5 ఏళ్ల నుంచి అన్ని విధాల అణిచివేస్తూ ఎన్నికల ముందు బ్రాహ్మణులతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించటం సిగ్గుచేటని టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్ మండిపడ్డారు. శనివారం నాడు మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 5 ఏళ్ల నుంచి బ్రాహ్మణులను అణగ దొక్కుతున్న జగన్‌కు ఎన్నికల ముందే బ్రాహ్మణులు గుర్తొచ్చారా అని ప్రశ్నించారు. దేవాలయాలపై, పూజారులపై, అర్చకులపై దాడులు జరిగినపుడు సీఎం ఎందుకు స్పందించలేదు? రామతీర్థంలో రాముడి విగ్రహ ధ్వంసం, అంతర్వేదిలో రథం దగ్ధం, విజయవాడ దుర్గ గుడిలో వెండి సింహాల మాయం ఘటనలపై విచారణ జరిపారా? ఆ ఘటనల్లో ఎంతమంది దోషుల్ని శిక్షించారు? కాకినాడలో అర్చకునిపై దేవాలయంలోనే వైసీపీ నేత బూతులు తిట్టి దాడి చేశారు. ఈ ఘటన జరిగినపుడు ఈవో, డీఎస్పీ వచ్చి దానిని రాజీచేసే ప్రయత్నం చేశారు తప్ప, నిందితులపై చర్యలు తీసుకోలేదు. మరో 40 రోజుల్లో టీడీపీ అధికారంలోకి వస్తుంది. ఇదే ఈవో, డీఎస్పీ చేత కాకినాడ ఘటనపై విచారణ చేసి దోషుల్ని శిక్షిస్తామని రాంప్రసాద్ స్పష్టం చేశారు.

***ప్రత్యేకంగా చేసిందేముంది?***

5 ఏళ్లలో బ్రాహ్మణ కార్పొరేషన్‌కి రూ. 1000 కోట్లు ఖర్చు చేశామని సీఎం గొప్పలు చెప్పుకుంటున్నారు. కానీ కార్పొరేషన్ ద్వారా ఒక్కరికైనా రుణాలిచ్చారా? సాధారణ సంక్షేమ పథకాలకు అర్హులు కాని వారి కోసం నాడు చంద్రబాబు నాయుడు బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. దేశంలోనే మొదటిసారిగా బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత చంద్రబాబుదే. ఈ కార్పొరేషన్ ద్వారా బ్రాహ్మణులకు 11 పథకాలు అమలు చేశారు. 1 -5 వ తరగతి విద్యార్థులకు రూ. 5 వేలు, 6,7 తరగతి విద్యార్థులకు రూ. 7500 , 8-12 వ తరగతి విద్యార్థులకు రూ. 10 వేలు, డిగ్రీ విద్యార్థులకు రూ. 15 వేలు, బీటెక్ విద్యార్థులకు రూ. 20 వేలు, పీజీ విద్యార్థులకు రూ. 25 వేలు ఇచ్చారు. ఇది వాస్తవం. వైసీపీ పాలనలో ఎంతమందికి కార్పొరేషన్ ద్వారా మేలు చేశారు? అందరికీ ఇచ్చిన నవరత్నాలే ఇస్తున్నారు తప్ప ప్రత్యేకంగా బ్రాహ్మణులకు జగన్ చేసిందేంటి? టీడీపీ హయాంలో బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా రూ. 235 కోట్లు ఖర్చు చేసి 1 లక్షా 63 వేల బ్రాహ్మణ కుటుంబాలకు లబ్ధి చేకూర్చారు. చంద్రబాబు హయాంలో విదేశీ విద్యకు 5 వేల మందిని పంపిస్తే నేడు జగన్ పాలనలో కేవలం 300 లోపు విద్యార్థులను మాత్రమే విదేశీ విద్యకు పంపారని రాంప్రసాద్ చెప్పారు.

***హామీలు విస్మరించిన జగన్***

నాడు రూ. 50 కోట్లతో క్రెడిట్ సొసైటీ ప్రారంభిస్తే, నేడు అందులో సభ్యత్వాలు 80 వేలకు చేరాయి. 9 జిల్లాలో క్రెడిట్ సొసైటీ బ్యాంకులు ఏర్పాటు చేశాం. దీనికి రూ. 100 కోట్లు డిపాజిట్లు ఉన్నాయి. దీని ద్వారా రూ. 100 కోట్ల మేర రుణాలు ఇచ్చారు. బ్రాహ్మణులకు అన్ని విధాల మేలు చేసిన వ్యక్తి చంద్రబాబు నాయుడు. వైసీపీ పాలనలో బ్రాహ్మణుల ఆస్తులన్నీ అన్యాక్రాంతం చేశారు. గత ఎన్నికల్లో బ్రాహ్మణులకు ఇచ్చిన ఒక్క హామీనైనా జగన్ అమలు చేశారా? 6 -సి దేవాలయాల్లో పనిచేసే అర్చకులకు



అదనంగా జీతాలు ఇస్తామన్న హామీ ఏమైంది? దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమా? దేవాలయాల్లో ధూప, దీప నైవేద్యం, అర్చకుల జీతాల కోసం పంచాయతీ జనాభాను బట్టి రూ. 25 వేల నుంచి రూ. 30 వేలిస్తామన్న హామీ ఏమైంది? జగన్ మాయలో బ్రాహ్మణులు పడొద్దు. బ్రాహ్మణ సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమని, వచ్చే ఎన్నికల్లో బ్రాహ్మణులంతా చంద్రబాబును గెలిపించాలని బుచ్చి రాంప్రసాద్ కోరారు.

# పింఛన్లపై జగన్ కుట్రకు 32 మంది అవ్వాతాతలు బలి

## శవ రాజకీయాలపై పేటెంట్ జగన్‌రెడ్డిదే - ధ్వజమెత్తిన టీడీపీ నేత నాదెండ్ల బ్రహ్మం

అమరావతి (చైతన్యరథం): శవ రాజకీయాల్లో జగన్ రెడ్డి పీహెచ్‌డీ చేశాడని, దేశంలోనే శవ రాజకీయాలు చేసే ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డే అని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మం ఎద్దేవా చేశారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాదెండ్ల బ్రహ్మం మాట్లాడుతూ జగన్ రెడ్డి నాలుగు సంవత్సరాల 11 నెలల పాలనా కాలంలో ప్రజలకు చేసిన మంచి ఏమీ లేదని విమర్శించారు. ప్రతి నెల 1వ తేదీన ఇవ్వాల్సిన పింఛన్లను ఆలస్యం చేసి, రాజకీయ లబ్ధి కోసం కుట్రపూరితంగా అవ్వాతాతలను జగన్ ఇబ్బందులు పెట్టాడు. ఇంటివద్ద పింఛన్లు ఇవ్వకుండా, మండు టెండల్లో వృద్ధులను సచివాలయాలకు రప్పించి 32 మంది అవ్వాతాతల మరణానికి జగన్‌రెడ్డి కారణమయ్యాడు. 2014లో తండ్రి చావును అడ్డుపెట్టుకొని రోడ్ల మీదకు వచ్చి ఎన్నికల్లో గెలవాలని ప్రయత్నించాడు. 2019లో బాబాయి మరణంతో రాజకీయ లబ్ధి పొందాడు. ఇప్పుడు అవ్వాతాతల మరణాలను అడ్డుపెట్టుకొని తిరిగి అధికారంలోకి రావాలని చూస్తున్నాడు. 32 మంది చావులకు సీఎం జగన్ రెడ్డి, సీఎస్ జవహర్ రెడ్డి, ముఖ్యమంత్రి కార్యాలయ అధికారి ధనుంజయ్ రెడ్డి, సెర్ప్ సీఈఓ మురళీధర్‌రెడ్డిలే కారకులు. ముఖ్యమంత్రి బినామీ కాంట్రాక్టర్ల కోసం వారం మునుపే రూ.13 వేల కోట్లను డ్రా చేసి దోచిపెట్టాడు. మార్చి 31 ఆర్థిక సంవత్సరం ముగింపు, ఏప్రిల్ 1, 2 తేదీలో బ్యాంకులకు సెలవు దినాలని తెలిసి కూడా ఇబ్బందులు సృష్టించి శవ రాజకీయాలు చేయాలని జగన్ రెడ్డి ఆడిన డ్రామా అది అని బ్రహ్మం మండిపడ్డారు.

**జగన్ రెడ్డికి కొత్తేమీ కాదు...**

శవ రాజకీయాలు చేయడం వైసీపీకి, జగన్ మోహన్ రెడ్డికి కొత్తేమీ కాదు. తండ్రి శవాన్ని పక్కనపెట్టుకొని ముఖ్యమంత్రి పదవి కోసం సోనియా గాంధీ మీద ఒత్తిడి తీసుకువచ్చాడు. తండ్రి చావును రిలయన్స్ కంపెనీపై నెట్టేసి సోనియా గాంధీ సాయంతో బెయిల్‌పై బయటకు వచ్చిన వ్యక్తి జగన్ రెడ్డి. కానీ అధికారంలోకి వచ్చాక రిలయన్స్ వారికే రాజ్యసభ సీటు ఇచ్చాడు. బాబాయి శవాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయ లబ్ధి పొందాడు. గేట్లు నిర్వహణ చేయకపోవడం వల్ల అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయి 42 మంది చనిపోతే శవ రాజకీయాలు చేశాడు. జగన్ దారిలోనే ఆయన మంత్రులు కూడా నడుస్తున్నారు. పెనమలూరులో వజ్రమ్మ అనే అవ్వ మరణిస్తే పదండి చంద్రబాబు ఇంటి వద్దకు తీసుకువెళ్దామని మంత్రి జోగి రమేష్ శవ రాజకీయం చేద్దామని ప్రయత్నిస్తే మృతురాలి బంధువులు తిరగబడ్డారు. జగన్ రెడ్డి చేసేది శవ రాజకీయాలు మాత్రమే అని ఆయన చిన్నాన్న కూతురు వైఎస్ సునీతా రెడ్డే చెబుతున్నారు. చంద్రబాబు వస్తేనే రాష్ట్రం బాగుపడుతుందని రాష్ట్ర ప్రజలు చెబుతున్నారు. వైసీపీ నాయకులు మాటలను ప్రజలు నమ్మటం లేదు. అందుకే ఏదో రకంగా ప్రజలను మభ్య పెట్టాలని పన్నాగాలు పన్నుతున్నారు. నిజంగా పింఛన్‌దారుల పట్ల జగన్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే పింఛన్ డబ్బులను వారం రోజుల ముందే ఎందుకు డ్రా చేయలేదు? రెండు, మూడు నెలల క్రితమే బటన్ నొక్కిన చేయూత, విద్యా దీవెన, ఈబీసీ నేస్తం డబ్బులు ఎందుకు ఇంతవరకు లబ్ధిదారుల ఖాతాల్లో డిపాజిట్ కాలేదు? ఆరోగ్యశ్రీ నిలిపేస్తామని ప్రైవేటు ఆసుపత్రులు నోటీసులు పంపుతున్నా వారికి బిల్లులు విడుదల చేయడం లేదు. జనవరి నెల నుంచి ఇప్పటివరకు



మొత్తంగా 4 పథకాల కోసం బటన్ నొక్కి డబ్బులు వేయలేదు కానీ బినామీ కాంట్రాక్టర్లకు మాత్రం జగన్ రెడ్డి దోచిపెట్టాడు. పింఛన్లపై గత 6 రోజుల నుంచి జగన్ రెడ్డి ఆడిన డ్రామా మొత్తం ప్రజలు గమనించారు. కావాలనే పింఛన్లు ఆలస్యం చేసిన, అవ్వాతాతల మరణానికి కారణమైన వారందరిపైనా క్రిమినల్ కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేయాలని బ్రహ్మం డిమాండ్ చేశారు.

# మూడు రాజధానుల శిబిరం మూసివేత శుభసూచకం

- జగన్ రెడ్డి సాగించిన విద్వేష రాజకీయాలకు ఆ శిబిరం నిదర్శనం
- నేటికైనా దళిత, గిరిజనులు నిజం తెలుసుకోవటం సంతోషదాయకం
- హర్షం వ్యక్తం చేసిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు నరహరి వరప్రసాద్

అమరావతి (చైతన్యరథం): జగన్ రెడ్డి మూడు ముక్కలాటకు బలై పోయిన దళిత, గిరిజన సోదరులు.. చంద్రబాబు అభివృద్ధి పాలనకే మద్దతుగా ఉంటామంటూ తెలుగుదేశం పార్టీ వైపు రావడం హర్షణీయమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు డాక్టర్ కొండారెడ్డి నరహరి వరప్రసాద్ అన్నారు. దేశంలో రాజధాని లేని రాష్ట్రంగా చేసి ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ ఇమేజ్‌ను జగన్‌రెడ్డి దెబ్బతీశాడని ఆయన విమర్శించారు. 2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి విడిపోయిన నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని లేని రాష్ట్రంగా మిగిలిపోయిందన్నారు. అటువంటి తరుణం లో ఆంధ్ర రాష్ట్ర వేగుచుక్కగా అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజలకు భరోసాగా నిలిచారన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి శంకుస్థాపన చేసి దేశ ప్రజల దృష్టిని ఆకర్షించడమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా అమరావతికి గుర్తింపు తెచ్చిన ఘనత చంద్రబాబు నాయుడిదన్నారు. 'మూడు రాజధానులు వద్దు..ఒకే రాజధాని ముద్దు' అంటూ బయటకు వస్తున్న దళిత, గిరిజనులకు స్వాగతం పలికారు. మోసపు హామీలతో 2019 ఎన్నికల్లో గెలిచిన జగన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలను నయవంచన చేస్తూ మూడు రాజధానుల బిల్లు తీసుకొచ్చి అమరావతిని రాజధానిగా లేకుండా చేసే దుర్మార్గపు చర్యలకు ఒడిగట్టాడు. దీంతో రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగింది. మూడు ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి రాష్ట్ర ప్రజల జీవితాలతో జగన్ రెడ్డి ఆటలాడుకున్నాడు. బహుజన పరిరక్షణ సమితి అనే పేరుతో జగన్ రెడ్డి వికృత క్రీడకు అమాయకపు ఎస్సీ, ఎస్టీలను బలి చేస్తూ మూడు రాజధానులకు మద్దతుగా కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేసి మందడం సీడ్ యాక్సిస్ రోడ్డులో దాదాపు నాలుగేళ్ల పైనే శిబిరం నిర్వహించేలా చేశారు. ఎంపీ నందిగం సురేష్ సారథ్యంలో నడిచిన ఈ శిబిరం నాయకులు జగన్ రెడ్డి మోసపు వాగ్దానాలకు, అరాచక పాలనకు విరక్తి చెంది తెలుగుదేశం పార్టీలో చేరడం హర్షణీయం. మూడు రాజధానుల శిబిరాన్ని ఎత్తేసి ఎస్సీ, ఎస్టీ వర్గాల నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరడం పట్ల జగన్ రెడ్డి సొంత సామాజిక వర్గానికి చెందిన రైతులు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రం కోసం నిస్వార్థంగా స్వచ్ఛందంగా భూములు ఇచ్చి అమరావతి నిర్మాణానికి అడుగులు వేసిన రైతుల త్యాగాలకి ఇది మరో విజయమని వారు అభిప్రాయపడుతున్నారు. అమరా వతి ప్రాంత ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అమరా వతి నగర నిర్మాత చంద్రబాబు నాయుడు ఎప్పుడు అధికారంలోకి వస్తాడా, అమరావతి ప్రాంత అభివృద్ధి ఎప్పుడు మళ్ళీ పునఃప్రారంభం అవుతుందా అని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ అభివృద్ధిని తుంగలో తొక్కి, రాష్ట్ర వినాశనమే ధ్యేయం గా పనిచేసిన జగన్ రెడ్డి రాబోయే ఎన్నికల్లో దళిత, గిరిజనులు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పడానికి మూడు రాజధానుల శిబిరం మూసివేతే నిదర్శనమన్నారు. దళిత, గిరిజన వర్గాల ఉన్నతే లక్ష్యంగా పనిచేసే చంద్రబాబు నాయకత్వంలో ప్రజా రాజధాని నిర్మాణం కోసం ఎస్సీ, ఎస్టీలు ఏకతాటి పైకి రావాలని నరహరి పిలుపునిచ్చారు. రాష్ట్ర



వ్యాప్తంగా దళిత, గిరిజనులు వేలాదిగా తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని, ఇది రాబోయే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అఖండ విజయానికి సూచిక అన్నారు.

# ఎన్డీయే కూటమితో వైసీపీ గుండెల్లో దడ

- టీడీపీ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు



విజయవాడ (చైతన్యరథం): ఎన్డీయే కూటమితో వైసీపీ గుండెల్లో దడ మొదలైందని, చంద్రబాబు అనుభవమున్న వ్యక్తి, పవన్‌కళ్యాణ్ నిబద్ధత కలిగిన వ్యక్తి టీడీపీ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు వ్యాఖ్యానించారు.

ప్రజాగళం పాదయాత్రలో భాగంగా సెంట్రల్ నియోజకవర్గంలోని 32వ డివిజన్ లోటస్ సెక్టార్ -2 వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ... గత తెలుగుదేశం పార్టీ ఈ సెంట్రల్ నియోజకవర్గంలో తాను అధికారంలో ఉండగా జరిగిన అభివృద్ధే తప్ప... ఈ వైసీపీ పాలనలో ఒక్కశాతం కూడా పనులు ముందుకు సాగలేదన్నారు. మహిళల సమస్యలు తెలుసుకోవడానికి తెలుగుదేశంపార్టీ నాయకులుగా మేము ఇంటింటికి వెళ్తుంటే మహిళలు తమ బాధలు చెప్పుకుంటున్నారు అని అన్నారు. నిత్యావసర ధరలు పప్పు, ఉప్పు, సరుకులు అన్ని ఆకాశాన్ని అంటుతున్నాయి అని, తెలుగుదేశం ప్రభుత్వంలో రూ.500 వచ్చే కరెంటు ఛార్జీలు, రూ.2,000 వరకు వస్తుందని కూలి పనులు చేసుకునే వారు ఎలా కడతారని ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డిని ఇంటికి పంపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎన్నికలకు ఇంకా కొద్దిరోజులు మాత్రమే మిగిలి ఉందని, వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు.

# వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు సైనికుల్లా పని చేయాలి

**మడకశిర నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి సునీల్ కుమార్**

మడకశిర (చైతన్యరథం): వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరు సైనికుల్లా పనిచేయాలని మడకశిర నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి సునీల్ కుమార్ పిలుపునిచ్చారు. ఐకమత్యమే మహాబలం అందరూ కలిసికట్టుగా పనిచేసి వైసీపీని తరిమికొట్టాలన్నారు. మడకశిర పట్టణంలో టీడీపీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ... ప్రతిష్టాత్మకముగా చేపడుతున్న శంఖారావంని మరింత వేగవంతం పెంచాలని తెలియజేశారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రతి ఇంటికి తెలియచేయాలని తెలియజేశారు. మడకశిర నియోజకవర్గం, హిందూపురం పార్లమెంట్ స్థానాల్లో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేయాలని కోరారు. తెలుగుదేశంపార్టీలో అందరూ కలిసి కట్టుగా పని చేద్దామని తెలియజేసిన సునీల్ కుమార్... వైసీపీ పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలంతా ఆసక్తిగా ఉన్నారని, వైసీపీ పాలనలో ప్రజలు ఎంతో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. వచ్చేది టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వమేనన్నారు. రాష్ట్రాన్ని ప్రగతి వైపు నడిపించే నాయకుడు చంద్రబాబుని వచ్చే ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పనిచేసి మడకశిరలో



తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేద్దామని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఈరన్న మాట్లాడుతూ... ఐకమత్యమే మహాబలం నియోజకవర్గంలోని నాయకులు కార్యకర్తలు కలసికట్టుగా పనిచేసి ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ కుమార్‌ని, ఎంపీ అభ్యర్థి బి.కే పార్థసారథిని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

# గత పాలకుల నిర్లక్ష్యం వల్లే నీటి కష్టాలు

- గుడివాడ హెడ్ వాటర్ వర్క్స్‌లో వెనిగండ్ల రాము పర్యటన



గుడివాడ (చైతన్యరథం): పాలకుల నిర్లక్ష్యం, అధికారుల బాధ్యతారాహిత్యంతో గుడివాడ ప్రజలకు నీటి కష్టాలు వచ్చాయని కూటమి పార్టీల అభ్యర్థి వెనిగండ్ల రాము ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఉదయం జిల్లాలోని గుడివాడ హెడ్ వాటర్ వర్క్స్‌లో రాము పర్యటించారు. కూటమి పార్టీల నేతలతో కలిసి మున్సిపల్ త్రాగునీటి చెరువుల్లో నీటి నిల్వలను పరిశీలించారు. పాతచెరువుకు మూడేళ్ల క్రితం పడిన గండిని పూడ్చకపోవడంతో అక్కడి పరిస్థితులను రాము మీడియాకు చూపించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. గుడివాడలో ఏ వార్డుకు వెళ్లినా త్రాగునీటి సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. రిజర్వాయర్లు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ అన్ని వసతులు ఉన్నప్పటికీ ప్రజలకు తాగునీరు సరఫరా చేయలేకపోతున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయంలో ప్రణాళిక బద్ధంగా పనిచేసేవాళ్ళమని చెప్పుకొచ్చారు. ఎమ్మెల్యే అంటే ప్రజల అవసరాలపై అవగాహన కలిగి ఉండాలని... దేశ రాజకీయాలు తప్ప గుడివాడ ప్రజల సమస్యలు ఎమ్మెల్యే పట్టవని మండిపడ్డారు. కాలవలు వదిలిన తర్వాత అయినా... అధికారులు బాధ్యత తీసుకొని పూర్తిస్థాయిలో నీరు నింపేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వచ్చే ఏడాదిలో పాత చెరువు గండి పూడ్చి.. ఆ చెరువును కూడా అందుబాటులోకి తెస్తామన్నారు. సరైన సమయంలో ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోకపోవడంతోనే నేడు తాగు నీరు అందక ప్రజలు కష్టపడుతున్నారన్నారు. పాత చెరువుకు మూడేళ్ల క్రితం పడిన గండి పూడ్చకపోవడంతో 36 ఎకరాల చెరువు వినియోగంలో లేకుండా పోయిందని వెనిగండ్ల రాము ఆగ్రహం వ్యక్తం చేశారు.

# జాబు రావాలంటే బాబు రావాలి

**మరికొద్ది రోజుల్లోనే రాష్ట్రానికి మంచి రోజులు రానున్నాయి - ఐటీ నిపుణులతో టీడీపీ నేతలు అంబికా, అమిలినేని ర్యాలీ**



కళ్యాణదుర్గం (చైతన్యరథం): అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పట్టణం తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి బెంగళూరు ఐటీ ఫోరమ్ అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో కళ్యాణదుర్గం తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల కూటమి అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబు, పార్లమెంట్ కూటమి ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, అమిలినేని తనయుడు యశ్వంత్ చౌదరి జనసేన ఇన్‌ఛార్జ్ బాల్యం రాజేష్, బీజేపీ ఇన్‌ఛార్జ్ ముప్పూరి దేవరాజు సమక్షంలో బెంగళూరు నుంచి వచ్చిన ఐటీ నిపుణులతో ప్రజావేదిక వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా అంబికా మాట్లాడుతూ... ఈ సైకో జగన్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రజా వేదిక కూల్చడంతోనే ప్రారంభించి ఉన్న పరిశ్రమలు ఇతర ప్రాంతాలకు తరలిపోయేలా చేసాడని, ఇలాంటి వ్యక్తికి ఓటు వేసి మోసపోవద్దంటు చంద్రబాబునాయుడికి ఓటేసి మరింత అభివృద్ధి సాధిద్దామన్నారు. అమిలినేని మాట్లాడుతూ... మన తెలుగు రాష్ట్రాల్లో ఐటీ పరిశ్రమ అభివృద్ధికి కారకుడు మన చంద్రన్న, నేడు మన తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో వేల మంది ఐటీ రంగంలో ఉద్యోగం పొందారంటే నాడు చంద్రబాబు చేసిన కృషే కారణమన్నారు. ఎక్కడ చూసిన అమ్మాయిలు కూడా ఐటీ రంగంలో రానిస్తూ కుటుంబానికి బాసటగా నిస్తున్నారంటేనే తెలుసుకోవచ్చు అభివృద్ధి అనేది ఎలా ఉందో, కొండలు గుట్టలు ఉన్న పెనుకొండ ప్రాంతానికి నీళ్లు తీసుకువచ్చి కియా పరిశ్రమ తీసుకొచ్చిన ఘనత మన చంద్రబాబునాయుడికి దక్కిందన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే మరింత అభివృద్ధి చేసి ఐటీ రంగాన్ని పరుగులు పెట్టిస్తారని అందుకు ప్రతి ఒక్కరూ తెలుగుదేశం పార్టీ సైకిల్ గుర్తుకు ఓటు వేసి

# రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే సమర్థుడు చంద్రబాబే

**కోవూరు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి**



కోవూరు (చైతన్యరథం): ఆర్థిక సంక్షోభంలో వున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపే సామర్థ్యం నారా చంద్రబాబు నాయుడుకు మాత్రమే ఉందని కోవూరు ఎన్డీయే కూటమి అభ్యర్థి ప్రశాంతిరెడ్డి వ్యాఖ్యానించారు. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన ఆమె... అనంతరం తెలుదేశంపార్టీ జాతీయ అధికార ప్రతినిధి పోలంరెడ్డి దినేష్‌రెడ్డితో కలిసి కొడవలూరు మండలంలోని ఎల్లాయపాలెం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ... ప్రజాస్పందన చూస్తుంటే దోపిడీ తప్ప అభివృద్ధి ఊసెత్తని అధికార పార్టీ నాయకుల నిర్వహకానికి జనం విసుగెత్తి పోయారని అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు సైకిల్ గుర్తు వున్న రెండు బటన్లు నొక్కి నెల్లూరు పార్లమెంటు సభ్యులుగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని, కోవూరు శాసనసభ్యురాలిగా తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

## చీరాలలో జోరుగా టీడీపీ ప్రచారం

- ఇంటింటి ప్రచారం చేపట్టిన ఎం.ఎం కొండయ్య



చీరాల (చైతన్యరథం): వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమికి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని చీరాల టీడీపీ అభ్యర్థి ఎం.ఎం కొండయ్య ప్రజల్ని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం నల్లగాంధీ బొమ్మ, ముంతవారి సెంటర్ గర్ల్స్ హైస్కూల్, సంగం సినిమా థియేటర్, ఆంధ్ర రత్న రోడ్డు మీదుగా, కూరగాయలు మార్కెట్, బ్రహ్మంగారి చెట్టు, శ్రీ భద్రావతి సమేత భావనా ఋషి స్వామి వారి దేవస్థానం, తెల్లగాంధీ బొమ్మ వరకు చేపట్టారు. సూపర్ సిక్స్ పథకాలను బీసీ డిక్లేషన్ ద్వారా అమలయ్యే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పెన్షన్ రూ.4,000 ఇస్తామని, ఆడబిడ్డ నిధి కింద 18 సంవత్సరాలు నిండిన మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తామని, ఇంటికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని, తల్లికి వందనం కింద ఎంతమంది పిల్లలు చదువుకుంటే ఒక్కొక్కరికి రూ.15,000 చొప్పున ఇస్తామన్నారు. ఇంటింటికి మంచినీటి పథకం ద్వారా సురక్షిత నీరు ఇస్తామని, ప్రతి రైతుకు ఏటా 20 వేల రూపాయల ఆర్థిక సాయం చేస్తామని, యువగళంనిధి కింద నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి ఇస్తామని, 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## కందుకూరులో వైసీపీకి భారీ షాక్

- తెలుగుదేశం పార్టీలో చేరిన 120 కుటుంబాలు



కందుకూరు (చైతన్యరథం): నియోజకవర్గంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. వైసీపీ నుంచి 120 కుటుంబాలు ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి. పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన ఆయన వచ్చే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి తన సహాయ సహకారాలు ఉంటాయని, పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కష్టపడాలని సూచించారు. రాష్ట్రాభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. మాజీ ఎంపీపీ సలహాదారు గుళ్ళా శ్రీనివాసరావు, బ్రహ్మయ్య, మహేంద్ర, దామవర్ల శ్రీనివాసులు తదితరులు పార్టీలో చేరారు.

చైతన్యరథం

# సూపర్ సిక్స్ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు

**- టీడీపీ రాష్ట్ర అధికార దాసరి శ్యామ్ చంద్ర శేషు**



జంగారెడ్డిగూడెం (చైతన్యరథం): సూపర్ సిక్స్ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతామని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు వ్యాఖ్యానించారు. శనివారం శ్రీనివాసపురం గ్రామంలో పార్టీ అధ్యక్షుడు పాల్నాటి సత్యనారాయణ ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించిన శంఖారావం రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఇంటింటికి వెళ్లి చేపట్టారు. ఈ సందర్భంగా శేషు మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వంలో సంక్షేమం సంక్షోభంలోకి వెళ్లిందని పేదలు తీవ్ర ఇబ్బందులుకు గురయ్యారని అన్నారు. పెరిగిన విద్యుత్ ధరలు, నిత్యావసరాల ధరలు డీజిల్, పెట్రోల్, గ్యాస్, ఆర్టీసీ ఛార్జీలు ఇలా అనేక విధాలుగా దోచుకుంటున్నారని అన్నారు. పన్నుల పేరుతో రాష్ట్రాన్ని అతలాకుతలం చేశారని అన్నారు. రాష్ట్రం ప్రగతి సాధించాలన్న, పేదలకు సరైన సంక్షేమం అందాలన్న అది టీడీపీ కూటమితోనే సాధ్యమని అన్నారు. రానున్న రోజుల్లో టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. వస్తే పింఛన్లు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో మండల రైతు అధ్యక్షులు ఎలికే ప్రసాద్, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు గొల్లమందల శ్రీనివాస్, బూత్ కన్వీనర్లు రాగాని శ్రీనివాస్, తాళ్లూరి వెంకటేశ్వరరావు, కేదాసు అర్జునరావు, కాగితాల శివయ్య తదితరులు పాల్గొన్నారు.

# బీసీలు, మైనార్టీలకు న్యాయం చేసింది టీడీపీనే: ప్రత్తిపాటి

చిలకలూరిపేట (చైతన్యరథం): రాష్ట్రంలో బీసీలు, మైనార్టీలకు న్యాయం చేసింది తెలుగుదేశం పార్టీ మాత్రమే అన్నారు మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు. దివంగత ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు వరకు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ప్రతిసారి అది అక్షరసత్యమని నిరూపించామన్నారు. 40ఏళ్లు పైబడిన పార్టీ ప్రస్థానంలో ఈ రోజుకీ బీసీలను, ముస్లింలను ఎవరూ తెలుగుదేశం పార్టీ నుంచి విడదీయలేకపోయారంటే అదే కారణమన్నారు ప్రత్తిపాటి. చిలకలూరిపేట తెలుగుదేశం పార్టీ 11వ క్లస్టర్ ఇన్‌ఛార్జి మద్దిబోయిన శివ ఆధ్వర్యంలో నిర్వహించిన జయహో బీసీ సదస్సులో ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రత్తిపాటి గడిచిన అయిదేళ్లలో ముఖ్యమంత్రి జగన్ బీసీ ఉపకులాల్లో ఎవరికీ కనీస న్యాయం చేయలేక పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పేరుకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా వాటికి నిధులు, విధులు లేకుండా ఉత్సవ విగ్రహాలుగా మార్చేశారని మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్, కూటమి ప్రభుత్వంలో తీసుకురానున్న బీసీ రక్షణ చట్టంతో ఈ వర్గాల వారందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. వైకాపా నాయకులు ఎంత దుష్ప్రచారం చేస్తున్నా ముస్లిం మైనార్టీల్లో తెలుగుదేశం పార్టీ, చంద్రబాబు పట్ల



ఉప్పొంగుతున్న అభిమానమే వారికి జరిగిన మేలుకు సాక్ష్యమన్నారు. రానున్న కూటమి ప్రభుత్వంలో కూడా ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుని తీరాతామని, ప్రతి ముస్లిం కుటుంబం ఆత్మగౌరవంతో, సుఖసంతోషాలతో ఏ లోటు లేకుండా జీవించేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన సమన్వయకర్త తోట రాజా రమేష్, బీజేపీ నాయకుడు జయరామ్‌రెడ్డి, టీడీపీ పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు తన్నీరు పుల్లారావు, భీమవరపు సుబ్బారావు, తుపాకుల అప్పారావు, షేక్ సాయిబాబా, చింతకాయల కోటి, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

**చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతల డిమాండ్ - ఎన్నికల కమీషనర్ మీనాకు ఫిర్యాదు చేసిన ఏఎస్ రామకృష్ణ, మన్నవ సుబ్బారావు**

అమరావతి (చైతన్యరథం): ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ తరుపున ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్న ప్రభుత్వ సలహాదారులైన ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.వెంకట్రామిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, గుంటూరు మిర్చి యార్డు మాజీ ఛైర్మన్ మన్నవ సుబ్బారావులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎన్నికల రాష్ట్ర ప్రధాన అధికారి ముకేష్ కుమార్ మీనాను కలిసిన వారు... నిబంధనలను ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ సలహాదారుడిగా ఉండి, ప్రభుత్వం వద్ద నుంచి జీతభత్యాలు తీసుకుంటూ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి రాష్ట్ర సచివాలయంలో పత్రికా విలేకరుల సమావేశం పెట్టి వైసీపీకి లబ్ధిచేకూరే విధంగా వ్యాఖ్యలు చేశారని, అవి ప్రభుత్వ ఉద్యోగులను ప్రభావితం చేసేలా ఉన్నాయన్నారు. ఉద్యోగులను ప్రలోభపెడుతూ, హామీలిస్తూ రాజకీయ వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని, దీనిపై తాము ఇప్పటికే తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని (ఎఫ్ఐఆర్ 97/2025, ఐపీసీ సెక్షన్ 188, 171 ఎఫ్) తెలిపారు.

### వెంకట్రామిరెడ్డిని సస్పెండ్ చేయాలి

ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె. వెంకట్రామిరెడ్డి ఆర్టీసీ ఉద్యోగులతో కలిసి ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా కడప, బద్వేలు, మైదుకూరు, ప్రొద్దుటూరు డిపోల్లో ప్రచారం నిర్వహించారని, ఆర్టీసీ ఉద్యోగులను కలిసి వైసీపీకి మద్దతు తెలపాలని కోరడంతో పాటు...



అనుమతి లేకుండా కరపత్రాలు పంపిణీ చేశారని అన్నారు. ఈ వ్యవహారంలో ఆయనతో కలిసి ప్రచారం నిర్వహించిన నలుగురిని సస్పెండ్ చేశారని, కానీ వెంకట్రామిరెడ్డిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. మరోవైపు గుంటూరు మిర్చియార్డ్‌లో వైసీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించుకోవడానికి ముగ్గురు అభ్యర్థులను అనుమతించి, వారు ఎన్నికల ప్రచార సమావేశాలు చేసుకోవడానికి ఏర్పాట్లు చేసిన మిర్చియార్డ్ ఇన్‌ఛార్జ్ కాకుమాను శ్రీనివాసరావు, వైసీపీ అభ్యర్థులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. పలువురు అధికారులు క్షేత్రస్థాయిలో వైసీపీ నేతలకు ఊడిగం చేస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని రామకృష్ణ, మన్నవ సుబ్బారావు డిమాండ్ చేశారు.

# కూన రవికుమార్ గెలుపుకై హనుమాన్ జంక్షన్‌లో ప్రత్యేక పూజలు

**అభయాంజనేయ స్వామి ఆశీస్సులు ఆముదాలవలసకు తీసుకువెళ్లి అందజేసిన టీడీపీ నేతలు**



శ్రీకాకుళం / గన్నవరం (చైతన్యరథం): శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస టీడీపీ కూటమి అభ్యర్థి కూన రవికుమార్ ఘన విజయం సాధించాలని కోరుతూ గన్నవరం నియోజకవర్గం హనుమాన్ జంక్షన్ లోని అభయాంజనేయ స్వామివారి ఆలయంలో స్థానిక టీడీపీ నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభయాంజనేయ స్వామి ఆశీస్సులతో కూడిన ప్రసాదం, స్వామి వారి శేషవస్త్రం, స్వామివారి చిత్రపటాన్ని నేరుగా ఆముదాలవలసకు తీసుకువెళ్లి టీడీపీ కూన రవికుమార్‌కు అందజేశారు. టీడీపీ సీనియర్ నేత, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు సమక్షంలో పలువురు టీడీపీ కార్యకర్తలు శనివారం ఆముదాలవలసలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కూనరవితో కలిసి ఇంటింటికి వెళ్లి టీడీపీ కూటమిని గెలిపించాలని కోరారు. టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు మాట్లాడుతూ... రాబోవు శాసనసభ ఎన్నికలలో కునా రవికుమార్ ఆముదాల వలస నియోజకవర్గం నుంచి ఘనవిజయం సాధించి భవిష్యత్తులో ఆంధ్ర ప్రదేశ్ కు, శ్రీకాకుళం జిల్లాకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై టీడీపీ సెల్ నాయకులు వల్లభనేని గిరిబాబు, బాపులపాడు మండల తెలుగుయువత నాయకులు వెనిగళ్ళ జ్ఞాన శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యగమనిక

తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు చేస్తున్న కార్యక్రమాలు ప్రతిరోజు ఈ క్రింది పేర్కొన్న ఫోన్‌నెంబర్‌కు వాట్సయాప్, లేదా ఈ-మెయిల్ ఐడికి పంపించగలరు. చైతన్యరథం పత్రికలో వాటిని ప్రచురించడం జరుగుతుంది. మీరు పంపించే కార్యక్రమాల వివరాలకు ఒక ఫోటో జత చేసి, మీ జిల్లా, నియోజకవర్గం పేరును స్పష్టంగా పేర్కొనగలరు. మీ వార్తలు పంపవలసిన
ఫోన్ నెంబర్ +91 9618727040,
ఈ మెయిల్ ఐడి cmews.tdp@gmail.com

# రాప్తాడులో ముగిసిన వైసీపీ చరిత్ర

- వలసలు ఆపుకునేందుకు ప్రకాష్ రెడ్డి సోదరులు పడరాని పాట్లు పడుతున్నారు
- నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీలోకి కొనసాగుతున్న వలసలు
- ఓ వైపు మాజీ మంత్రి పరిటాల సునీత.. ఇంకోవైపు పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో చేరికలు



రాప్తాడు (చైతన్యరథం): నియోజకవర్గంలో వైసీపీ ఉందన్నది గత చరిత్రగా మారుతుందని మాజీ మంత్రి పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అన్ని మండలాల నుంచి వైసిపి నాయకులు తెలుగుదేశం పార్టీలోకి క్యూ కడుతున్నారు. ప్రతిరోజు ఏదో ఒక గ్రామం నుంచి చేరికలు జరుగుతున్నాయి. తాజాగా మాజీ మంత్రి పరిటాల సునీత ఆధ్వర్యంలో పలు గ్రామాలకు చెందిన కీలక నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఐదు గ్రామాలకు సంబంధించిన వైసీపీ నాయకులు వేరువేరు సందర్భంలో పార్టీలోకి చేరారు. తన క్యాంపు కార్యాలయంలో వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. మరోవైపు పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో రెండు గ్రామాలకు చెందిన వైసిపి నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. రామగిరి మండలం వెంకటాపురంలోని తన నివాసంలో వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పరిటాల సునీత మాట్లాడుతూ ప్రతిరోజు వైసిపి నాయకులు తెలుగుదేశం పార్టీలోకి వస్తుండటంతో ప్రకాష్ రెడ్డి సోదరులకు నిద్ర లేకుండా పోయిందన్నారు. గ్రామాలకు వెళ్లి టిడిపిలోకి వెళ్లవద్దని అడుక్కునే పరిస్థితి వచ్చిందన్నారు. అయినప్పటికీ చాలామంది నాయకులు ధైర్యంగా తెలుగుదేశం పార్టీలోకి వస్తున్నారని.. ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి సోదరులకు ఇక భయపడాల్సిన అవసరం లేదని రెండు నెలల్లో వారు దుకాణం ఖాళీ చేయాల్సిందేనని అన్నారు. తెలుగుదేశం పార్టీలోకి వచ్చిన ప్రతి ఒక్కరికి సముచితస్థానం ఉంటుందని తెలిపారు. మరోవైపు పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ వైసిపి లో ఎన్ని రోజులు ఎంతోమంది అయిష్టంగా కొనసాగారని.. అందుకే ఎన్నికల సమయంలో ఇలా వలసలు సాగుతున్నాయన్నారు. రానున్న రోజుల్లో ఈ వరుసలు మరిన్ని ఉంటాయని శ్రీరామ్ అభిప్రాయపడ్డారు. పార్టీలోకి చేరిన వారి వివరాలు ఇలా ఉన్నాయి మాజీ మంత్రి పరిటాల సునీత సమక్షంలో అనంతపురం రూరల్ మండలం, కామారుపల్లి గ్రామానికి చెందిన వైకాపా నాయకులైన, భజన రాముడు, మూలి చంద్రశేఖర్ రెడ్డి, భజన రంగయ్య, భజన రమేష్, రాము, దాసరి నాగేశ్వరమ్మ, మాజీ వార్డు సభ్యులు జెన్నే నాగన్న, జెన్నే సుబ్బారాయుడు, హరిజన చిన్న నల్లప్ప మరియు రాప్తాడు నియోజకవర్గ కేంద్రంలోని, ఎస్సీ కాలనీకి చెందిన వైకాపా నాయకులైన, సాకే పెన్నోబులేసు, రామలింగడు, సాకే నాగరాజు, సాకే ముత్యాలు, సాకే నాగార్జున మరియు రామగిరి మండలం, పోలేపల్లి పంచాయతీ, పాపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వైకాపా నాయకులైన లక్ష్మీనారాయణ, ఎం.రమేష్, వి.నరసింహులు, ఎం.శ్రీనివాసులు, ఎం.అంజి, ఎం.ఉపేంద్ర మరియు చెర్లోపల్లి గ్రామానికి చెందిన యర్రమంచి హనుమంతు, వడ్డే శివతేజ, ముష్టికోవెల మురళి, గిరక జయచంద్ర, రమణారెడ్డి తదితరులున్నారు. పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో కనగానపల్లి మండలం, బాలేపాళ్యం గ్రామానికి చెందిన వైకాపా నాయకులైన, వడ్డే పెద్దన్న, వడ్డే లక్ష్మీ కాంత్, ఆలకుంట రమణ, స్కూల్ కమిటీ ఛైర్మన్ వడ్డే రవి, రామగిరి మండలం పేరూరు గ్రామ వైఎస్ఆర్సిపి నాయకులు బెస్త వెంకటేష్, బెస్త నాగేంద్ర తదితరులు టీడీపీలోకి చేరారు.

చైతన్యరథం

# మరోసారి జగన్ వస్తే ఏపీని మర్చిపోవడమే

- మాజీమంత్రి కొల్లురవీంద్ర హెచ్చరిక

**మచిలీపట్నంలో ఎన్డీయే కూటమి అభ్యర్థి వల్లభనేని బలశౌరి పరిచయ కార్యక్రమం**



మచిలీపట్నం (చైతన్యరథం): వచ్చే ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థి వల్లభనేని బాలశౌరిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని నియోజకవర్గ ప్రజలకు మాజీ మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. శనివారం మచిలీపట్నంలో నిర్వహించిన వల్లభనేని బాలశౌరి పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఒక్కఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని సర్వనాశం చేశాడని, దోచుకోవడమే లక్ష్యంగా సాగుతున్న వైసీపీ పాలనకు చరమగీతం పాడాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రాభివృద్ధి కోసమే తాము పొత్తు పెట్టుకోవడం జరిగిందని, నష్టపోయిన రాష్ట్రాన్ని పున: నిర్మించుకోవాల్సిన అవసరం ప్రతిఒక్కరిపై ఉందన్నారు. పింఛన్ల పంపిణీపై వైసీపీ శవరాజకీయాలు చేస్తోందని, రక్తంతో తడిసిన పునాదుల్లో వైసీపీ నిర్మాణం జరిగిందని సొంత చెల్లెలు సునీత చెబుతుందంటే జగన్‌రెడ్డి రాజకీయాలు ఏవిధంగా ఉంటాయో అర్థం చేసుకోవచ్చునన్నారు. ఈసారి వైసీపీ అధికారంలోకి వస్తే రాష్ట్రం నామరూపాలు లేకుండా పోతుందని, మరోసారి జగన్ అధికారంలోకి వస్తే ఏపీని ఒక మర్చిపోవడమేనన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ఎన్డీయే కూటమిని ప్రజలు బలపరచాలని కొల్లు రవీంద్ర కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొనకళ్ళ నారాయణరావు, మచిలీపట్నం నియోజవర్గ జనసేనపార్టీ ఇన్‌ఛార్జ్ బండి రామకృష్ణ, బీజేపీ నాయకులు పంతం గజేంద్ర, రాష్ట్ర పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి కొనకళ్ళ జగన్నాథరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహ కార్యదర్శి బచ్చుల సుబ్రహ్మణ్యం (బోస్), జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ, నగర పార్టీ అధ్యక్షులు ఇలియాస్ పాషా, రూరల్ పార్టీ అధ్యక్షులు కుంచె నాని, నగర పార్టీ ప్రధాన కార్యదర్శి పిప్పళ్ళ కాంతారావు తదితర ముఖ్య నాయకులందరూ పాల్గొన్నారు.

## పింఛన్ల పంపిణీలో వైసీపీ నాటకాలు ఆడుతోంది

- బివి జయనాగేశ్వరరెడ్డి



ఎమ్మిగనూరు (చైతన్యరథం): పింఛన్ల పంపిణీ విషయంలో వైసీపీ ప్రభుత్వం నాటకాలు ఆడుతోందని, పెన్షన్ల పంపిణీకి నిధులు కేటాయించకుండా అవ్వా తాతలు, వికలాంగులను మోసం చేస్తోందని నియోజకవర్గ టీడీపీ నేత బివి జయనాగేశ్వరరెడ్డి వ్యాఖ్యానించారు. శనివారం సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక ఎమ్మిగనూరు పట్టణంలోని 18వ వార్డులో ఇంటింటి ప్రచారం చేసి... సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమిని గెలిపించాలని కోరారు. జగన్ పరిపాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని, దోచుకోవడమే లక్ష్యంగా వైసీపీ పాలన సాగుతోందన్నారు.

# రౌడీయిజాన్ని ప్రోత్సహిస్తున్న పిన్నెల్లి సోదరులు

**టీడీపీ కార్యకర్తపై వైసీపీ సైకోల దాడి - బాధితుడ్ని పరామర్శించిన రాష్ట్ర ఎస్టీసెల్ అధ్యక్షులు ఎం.ధారునాయక్**



పల్నాడు (చైతన్యరథం): మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలం, కొత్త పుల్లారెడ్డిగూడెంలో ఈ నెల 5వ తేదీన స్థానిక వైసీపీ నాయకులు చేసిన దాడిలో తీవ్రంగా గాయపడిన ముడావత్ తులసి నాయక్‌ని టీడీపీ రాష్ట్ర ఎస్టీసెల్ అధ్యక్షులు ఎం. ధారునాయక్ శనివారం పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని పార్టీ అన్నివిధాలుగా అండగా ఉంటుందన్నారు. వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి సోదరులు నియోజకవర్గంలో పెద్దఎత్తున రౌడీయిజాన్ని ప్రోత్సహిస్తున్నారని, వారి అండదండలతోనే ముడావత్ తులసి నాయక్‌పై భౌతిక దాడులకు పాల్పడ్డారని అన్నారు. తులసి నాయక్ జీవనాధారమైన ఆటోని ధ్వంసం చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రౌడీయిజం పెరిగిపోయిందని, బాలాయిని గొడ్డలి వేటుతో చంపిన నాయకుల్ని వైసీపీ కార్యకర్తలు ఆదర్శంగా తీసుకుని దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. మాచర్లలో పిన్నెల్లి సోదరుల అరాచకాలు పరాకాష్టకు చేరాయన్నారు. అభివృద్ధి చేయటం చేతకాక దౌర్జన్యంతో, భౌతిక దాడులకు పాల్పడుతూ... పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నియోజకవర్గంలో అరాచకం సృష్టిస్తున్నారని అన్నారు. వైసీపీ నాయకులు రాక్షస జాతికి చెందిన వారని, ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతూ నరమేధం సాగిస్తున్నారని అన్నారు. మాచర్ల నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో టీడీపీ కార్యకర్తలను బలవంతంగా పార్టీలు మారేటట్లు మాయ చేస్తున్నారని, ఎన్ని అరాచకాలు, ఎంత మాయ చేసినా పోలింగ్ బూత్‌లో మాత్రం వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తు మీద ఓటు వేసి రాక్షస పాలనను ఈ రాష్ట్రం నుంచి తరిమికొట్టడం ఖాయమన్నారు.

## రోజురోజుకు రాచమల్లుకు ఝలక్ ఇస్తున్న వైసీపీ నేతలు

**నంద్యాల వరదరాజుల రెడ్డి సమక్షంలో టీడీపీలోకి చేరికలు**



ప్రొద్దుటూరు (చైతన్యరథం): ప్రొద్దుటూరులో వైసీపీ కార్యకర్తలు ఆ పార్టీకి రోజురోజుకు ఝలక్ ఇస్తున్నారు. శనివారం నంద్యాల వరదరాజులరెడ్డి సమక్షంలో పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి వరదరాజులరెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజక వర్గంలో అభివృద్ధి శూన్యమని, దోచుకోవడమే లక్ష్యంగా స్థానిక వైసీపీ ఎమ్మెల్యే పనిచేస్తున్నారని అన్నారు. ఒక్కఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ పని అయిపోయిందని, ఎన్ని కుట్రలు చేసిన వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపు ఖాయమన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయగలిగిన సత్తా ఒక్క టీడీపీకి మాత్రమే ఉందని అని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్నికలు సజావుగా జరగాలంటే... ఆ ముగ్గురిని తొలగించండి

- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ డిమాండ్

అమరావతి (చైతన్యరథం): ఎన్నికలు సజావుగా జరగాలంటే ఏపీ సీఎస్, డీజీపీ, బేవరేజ్ కార్పొరేషన్ ఛైర్మన్ వాసుదేవ రెడ్డిలను వెంటనే విధుల నుంచి తొలగించాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ డిమాండ్ చేశారు. ఎన్నికల వేళ అక్రమ మద్యాన్ని అరికట్టాలని, నిజాయితీపరులైన అధికారులను నియమించి ఎన్నికలు సజావుగా సాగేలా ఎన్నికల సంఘం కృషి చేయాలని అన్నారు. ఈ మేరకు అమరావతిలో మీడియాతో మాట్లాడిన ఆయన... రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన పలువురు అధికారులు ఇంకా అధికారపార్టీ నేతలకు ఊడిగం చేస్తున్నారని అన్నారు. ముఖ్యంగా ఏపీ సీఎస్ జవహర్ రెడ్డి, డీజీపీ కసిరెడ్డి రాజేంద్రనాథ్ రెడ్డి, బేవరేజ్ కార్పొరేషన్ ఛైర్మన్ వాసుదేవ రెడ్డిలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఇప్పటి తాను ఈసీకి లేఖ రాయడం జరిగిందని, దీనిపై వెంటనే ఎన్నికల కమిషన్ స్పందించాలని పాతర్ల కోరారు. రాబోయే ఎన్నికల్లు ప్రశాంతమైన వాతావరణంలో జరగాలని అందుకు ఎన్నికల సంఘం తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైసీపీ నాయకులు ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రజలకు భారీగా నగదు, మద్యం పంపిణీ చేస్తున్నారని, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం దుర్మార్గమన్నారు. పక్క రాష్ట్రాల నుంచి భారీ ఎత్తున కల్తీ మద్యాన్ని దిగుమతి చేసుకుంటున్న



వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని పాతర్ల రమేష్ డిమాండ్ చేశారు.

## జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

**దర్శిలో ఎన్నికల ప్రచారం చేపట్టిన గొట్టిపాటి లక్ష్మీ**



దర్శి (చైతన్యరథం): వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమిని భారీ మెజారిటీతో గెలిపించాలని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మీ కోరారు. శనివారం నగర పంచాయతీలోని 18వ వార్డులో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని, మరో 20 ఏళ్లు వెనక్కి పోయిందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి లేదని, సంక్షేమం పేరుతో ప్రజల్ని మోసం చేస్తున్నారని అన్నారు. జగన్ ఒక చేత్తో రూ.10 ఇచ్చి మరో చేత్తో రూ.100 కొట్టేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రాభివృద్ధి జరగాలంటే టీడీపీతోనే సాధ్యమని వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారాపుశెట్టి పాపారావు, లలిత్ సాగర్, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు తిండి నారాయణరెడ్డి, జనసేన టౌన్ అధ్యక్షులు దాతరాసి కొండయ్య, తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

- పిఠాపురంలో వర్మ ఇంటింటి ప్రచారం

పిఠాపురం (చైతన్యరథం): వచ్చే ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థి పవన్ కళ్యాణ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని నియోజకవర్గం టీడీపీ నేత ఎస్.వీ.ఎస్.ఎస్ వర్మ పిలుపునిచ్చారు. శనివారం పిఠాపురం టౌన్ 5,6,7,9 వార్డుల్లో ఆయన పర్యటించారు. వచ్చే ఎన్నికల్లో గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి పవన్ కళ్యాణ్‌ను గెలిపించాలని కోరారు. జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. దోచుకోవడమే లక్ష్యంగా వైసీపీ పాలన సాగుతోందన్నారు. వైసీపీ పాలన పోయి... సైకిల్ పాలన రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

